



అంతర్వేది నరసన్న కల్యాణ వైభవం





కల్యాణోత్సవ శోభతో అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని అంతర్వేది లక్ష్మీనర సింహస్వామి క్షేత్రం శోభిల్లింది. సకల దేవ తల ఆశీర్వచనాలతో వేద మంత్రోచ్చ రణల మధ్య శుక్రవారం రాత్రి నరసింహ స్వామి ఉభయ దేవేరులైన భూదేవి, శ్రీదేవి లను కల్యాణమాడారు.

6



ద్వారకాతిరుమల మండలం ఐఎస్ జగన్నాథపురంలోని శ్రీలక్ష్మీ నరసింహస్వామి కల్యాణం పదో తేదీన జరగనుంది. ఈ నేపథ్యంలో విద్యుత్ దీపాలతో ఆలయాన్ని ముస్తాబు చేశారు.



లే అవుట్ల క్రమబద్ధీకరణపై.. నీలినీడలు!

- నాలా చార్జీల పెంపుతో ముందుకురాని రియల్టర్లు
- సరైన పత్రాల సమర్పణలోను అవగాహన లేమి
- దరఖాస్తుల్లో 50 శాతం కూడా పూర్తి కాని వైనం

ఏలూరు, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): జిల్లాలో లేఅవుట్ల క్రమబద్ధీకరణ పథకం (ఎల్ఆర్ఎస్) కింద దరఖాస్తులు పరిష్కారానికి నోచుకోవడం లేదు. రియల్టర్లు, భూ యజమానులు సరైన పత్రాలు సమర్పించకపోవడంతో ఎక్కడ వేసిన గొంగళి అన్న చందాన పరిష్కారం లభించడం లేదు. ఇవి పూర్తయితే పంచాయతీలు, మునిసిపాలి టీలకు ఆదాయం సమకూరుతుంది. ఎల్ఆర్ఎస్‌కు దరఖాస్తు కింద ప్రస్తుతం రూ.10వేల చొప్పునే ఫీజులు చెల్లించారు. క్రమబద్ధీకరణ జరిగితే భారీగానే ఆదాయం లభిస్తుంది. క్షేత్రస్థాయిలోనే రియల్టర్లు, యజమానులు, ప్లాట్ల ఓనర్లకు అవగాహన కల్పించలేకపోవడంతో దరఖాస్తులు పరిష్కారం కావడం లేదు. దీందో క్రమబద్ధీకరణపై నీలినీడలు కమ్ముకున్నాయి. ఏలూరు అర్బన్ అథారిటీ (యుడా) పరిధిలో ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లోని 627 పంచాయతీల్లో 1,623 దరఖాస్తులు వచ్చాయి. 485 దరఖాస్తులు క్రమబద్ధీకరణ చేయడానికి ఆమోదం తెలిపారు. 80 తిరస్కరించారు. 225 పరిశీలనలో ఉన్నాయి. 800 కేసుల వ్యవహారాల్లో షార్ట్ ఫాల్ సర్టిఫికేట్లను సమర్పించాలని ఆదేశాలు ఇచ్చారు. అయినా పెండింగ్ సంఖ్యే పెద్దగా కనిపిస్తోంది.

వైసీపీ ప్రభుత్వంలో 2020 నుంచి పెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం గతేడాది డిసెంబరులో మరో అవకాశం కల్పించింది. ఇది కొందరికి వరంగా మారింది. లైసెన్సు సర్వేయర్లు, సాంకేతిక సహాయకులు కొర్రీల పేరుతో ఇబ్బందులకు గురి చేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. సమర్పించాల్సిన పత్రాలను ఎప్పటికప్పుడు తెలియపరచకుండా కాలయాపన చేసి గడువు సమీపించేసరికి ఒత్తిడి చేస్తున్నారని దరఖాస్తుదారులు వాపోతున్నారు. కొన్నింటికి కొర్రీల పేరుతో వసూళ్లకు పాల్పడుతున్నారని ఆరోపిస్తున్నారు. ఈ సారైనా ఎల్ఆర్ఎస్ దరఖాస్తులకు మోక్షం కలిగేలా చూడాలని కోరుతున్నారు. ఇదిలా ఉండగా అనధికారిక లే-అవుట్లు కూడా పుట్టుకొస్తున్నాయి. వీటిపై పంచాయతీల కార్య నిర్వాహణాధికారులు పట్టింపు లేమితో పల్లెలు, పట్టణాల్లో రియల్టర్ల దందా పెచ్చు మీరుతోంది.

గడువు పెంచుతూ..

వాస్తవానికి 2020 జనవరిలో ఎల్ఆర్ఎస్‌కు గత ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. 2019 ఆగస్టు 31కి ముందు రిజిస్ట్రేషన్ అయిన ప్లాట్లకు క్రమబద్ధీకరణ వర్తించేలా ఆదేశాలు జారీ చేసింది. 2022 నాటికే గడువు పెంచుకుంటూ వచ్చింది. చివరకు 2023 వరకు పెంచారు. ఇంకా దరఖాస్తులు భారీగా ఉండిపోవడంతో కూటమి ప్రభుత్వం చివరి అవకాశం ఇచ్చింది. వీటిని మార్చి నెలాఖరు నాటికి పూర్తి చేయాలని ఆదేశించింది. జనవరి పూర్తయినా చాలా మంది దరఖాస్తుదారులకు సమాచారమే అందలేదు.

పత్రాల సమర్పణ అవసరం..

అనుమతి ఇవ్వాల్సిన దరఖాస్తులు ఎక్కువగా ఉండగా వీటిలో అవసరమైన పత్రాలు సమర్పించనవి ఎక్కువగా ఉండగా, నిర్లక్ష్యంగా వదిలేసినవి కొన్ని ఉన్నాయి. కొన్ని లేఅవుట్లకు రోడ్డు చూపించకపోవడం, నిరభ్యంతర పత్రాలు సమర్పించకపోవడం, భూ వినియోగమార్పిడి చేయకపోవడం వంటివి ఉన్నాయి. లే-అవుట్ ప్లాన్ మార్చి పంపాల్సినవి చాలా ఉన్నాయి. కొన్ని లే అవుట్లకు సంబంధిత యజమానులు ప్రభుత్వ భూముల నుంచి దారులు చూపించారు. అటువంటి వాటికి కలెక్టర్ అనుమతి అవసరం. పలు రకాల సర్వే సమస్యలతో ఆగిపోయినవే ఎక్కువ. నిర్లక్ష్యంగా ఆపేసిన దరఖాస్తులు కొన్ని ఉన్నట్లు చర్చ సాగుతోంది. ఒకే లే-అవుట్‌లో ఒకే సమస్యతో దరఖాస్తు చేసిన వాటిల్లో కొన్నింటికి గతంలో అనుమతిచ్చి, మరికొందరికీ అనుమతించలేదు.

ఫీల్డ్ స్థాయిలో ఇబ్బందులు

2006కు ముందు స్థలాలు గజాల్లో ఉన్న దానికి ఇప్పుడు నాలా చార్జీలు చెల్లింపు ప్రక్రియ ఓ ఆటంకంగా చెబుతున్నారు. 2019లో నాలా చార్జీలు (భూమార్పిడి వ్యయం) మూడు నుంచి ఐదుశాతం పెంచడాన్ని లే- అవుట్ యజమానులు వ్యతిరేకిస్తున్నారు. దీనివల్ల కూడా క్రమబద్ధీకరణ ముందుకు సాగడం లేదు. ఓపెన్ స్పేస్ చార్జీల మార్కెట్ వాల్యూ ఏటా 10 శాతం పెరగడం వల్ల యజమానులపై భారం పెరుగుతోంది. ఎల్ఆర్ఎస్ కోసం రూ.10 వేలు కట్టి దరఖాస్తు చేసుకున్న వారు సైతం 2019 ధరలు చూసి లబోదిబో మంటున్నారు. భూములకు సంబంధించి లింకు డాక్యుమెంట్లు సక్రమంగా లేకపోవడం. లే-అవుట్‌లో చూపించిన దానికంటే ఎక్కువ స్థలం దస్తావేజులో ఉండడం తదితర కారణాలతో అవి సవరణలు చేయకపోవడంతో రియల్టర్లు పట్టించుకోవడం లేదు. పంచాయతీలు, మునిసిపాటీలు ఆదాయం కోల్పోతున్నాయి.

మార్చి నాటికి దరఖాస్తుల పరిష్కారం

దరఖాస్తులతో పాటు అవసరమైన డాక్యుమెంట్లను సమర్పించని కారణంగా ఎక్కువగా దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. వీటికి నోటీసులు జారీచేసి, వాటిని సిబ్బంది పాలో అప్ చేస్తున్నాం. మార్చి నాటికి దరఖాస్తులను పరిష్కరిస్తాం. పంచాయతీ ఈవోలను పిలిపించి వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నాం. రియల్టర్లు, భూ యజమానులు సహకరించాలని కోరుతున్నాం. వారిపై ఎలాంటి ఒత్తిడులు పెట్టడం లేదు. వివరాలనే అడుగుతున్నాం.

- వి.సుధాకర్, యుడా ప్లానింగ్ ఆఫీసర్

తీపికబురు

- ఎన్టీఆర్ గ్రామీణ హౌసింగ్ పథకం పెండింగ్ బిల్లుల చెల్లింపునకు నిర్ణయం
- వైసీపీ హయాంలో నిర్లక్ష్యానికి గురైన లబ్ధిదారులకు ఊరట
- జిల్లాలో రూ.40.9 కోట్ల బకాయిలు

ఏలూరు సిటీ, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి):ఎన్టీఆర్ గ్రామీణ హౌసింగ్ పథకం కింద 2014-19 మధ్య అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో మంజూరైన ఇళ్ల నిర్మాణ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. గత వైసీపీ ప్రభుత్వం టీడీపీ హయాంలో నిర్మించిన ఇళ్లకు బిల్లులు చెల్లించకపోవడంతో లబ్ధిదారులు ఆ బిల్లుల కోసం ఎదురుచూస్తున్నారు. జిల్లాలో ఈ పథకం కింద 26,840 ఇళ్ల నిర్మాణాలు జరగ్గా, అందులో 20 వేల ఇళ్లు వివిధ దశల్లో నిర్మాణంలో ఉండగా వైసీపీ అధికారం చేపట్టింది. పెండింగ్‌లోని ఆ బిల్లులపై దృష్టి సారించలేదు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో లబ్ధిదారులకు పెండింగ్ బిల్లులు చెల్లించాలని నిర్ణయించింది. జిల్లాలో 20 వేల మందికి సుమారు రూ.40.9 కోట్ల వరకు చెల్లించాల్సి ఉంటుందని జిల్లా హౌసింగ్ శాఖ అంచనా వేసింది. అయితే బిల్లులు చెల్లిద్దామనుకున్న తరుణంలోనే ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. కోడ్ ముగిశాక మార్చి నాటి కల్లా ఆ మొత్తాలను లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు చెల్లించేలా నిర్ణయం తీసుకోవడంతో తీపి కబురు అందించినట్టయింది. ఈ బిల్లులు తమకు త్వరితగతిన చెల్లిస్తే తమకు ఆర్థికంగా చేయూత ఇచ్చినట్టవుతుందని లబ్ధిదారులు పేర్కొంటున్నారు.



అధికారులు కావలెను..!

- పరిశ్రమలు, రెవెన్యూ శాఖల్లో కీలక పోస్టుల ఖాళీ
- 12 మంది సర్వేయర్ పోస్టులూ ఖాళీ

ఏలూరు, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి):జిల్లాలోని ప్రభుత్వశాఖల్లో అధికారుల కొరత వేధిస్తోంది. నెలలు తరబడి ఆయా పోస్టులు ఖాళీగా ఉండడంతో మిగతా కిందిస్థాయి అధికారులు ఇన్‌చార్జుల భారాన్ని మోయాల్సి వస్తోంది. ప్రభుత్వ పథకాల వేగానికి అనువుగా పరుగులు పెట్టలేక అవస్థలు పడుతున్నారు. జిల్లా స్థాయిల్లో ఏలూరు కలెక్టర్ అధ్యక్షతన జరిగే మీటింగ్‌లకు, క్షేత్రస్థాయిలో సర్వేలు, ప్రభుత్వ పథకాలను వేగవంతంగా అమలు చేయడానికి ఆపసోపాలు పడుతున్నారు. గతేడాది డిసెంబరు 31న జిల్లాలో పశుసంవర్ధకశాఖ జేడీ నెహ్రూబాబు ఉద్యోగ విరమణ చేయడంతో ఆ పోస్టు ఖాళీగా ఉంది. డిప్యూటీ డైరెక్టర్ గోవిందరాజులు ఇన్‌చార్జి జేడీగా వ్యవహరిస్తున్నారు.

- జిల్లా పరిశ్రమల కేంద్రంలో అసిస్టెంట్ డైరెక్టర్, జీఎం పోస్టులతో పాటు ఇండ్రస్టియల్ ప్రమోషనల్ అధికారులు కొరత ఉంది. ఐదు ఇండస్ట్రియల్ ప్రమోషనల్ అధికారుల పోస్టులకు ఇద్దరే ఉన్నారు. ఐదుగురు విధులు నిర్వహించే 27 మండలాల్లో ప్రస్తుతం పావని, దొర అనే ఇద్దరు అధికారులే క్షేత్రస్థాయిలో యూనిట్ల స్థాపనకు, జిల్లా మీటింగ్‌లు వెళ్లాల్సి వస్తోంది. ప్రస్తుతం కొద్ది నెలలు క్రితం డిప్యూటీ డైరెక్టర్‌గా విజయవాడ నుంచి బదిలీపై వచ్చిన పి.సుబ్రహ్మణ్యేశ్వరరావు పూర్తి అదనపు బాధ్యతలతో జీఎంగా కొనసాగుతున్నారు. ఆయన కూడా కొద్ది నెలల్లో రిటైరవుతున్నారు. పరిశ్రమల సర్వే, ప్రధానమంత్రి రోజ్‌గార్ యోజన వివిధ పథకాల యూనిట్ల స్థాపనలోను ఇబ్బందులు తప్పడం లేదు.
- రెవెన్యూ శాఖలో కలెక్టరేట్ పరిధిలోను వివిధ సెక్షన్లు పర్యవేక్షించే విభాగాలకు అధికారులు కొరత ఏర్పడింది. జిల్లా వ్యాప్తంగా తొమ్మిది మండలాల్లో ఉంగుటూరు, ఏలూరు రూరల్, పెదవేగి, మండవల్లి, కైకలూరు, నూజివీడు, టి.నరసాపురం, జీలుగుమిల్లి, కుక్కునూరుల్లో తహసీల్దార్ల పోస్టులు భర్తీ చేయాల్సి ఉంది. దీంతో ఇక్కడ డిప్యూటీ తహసీల్దార్లే ఇన్‌చార్జులుగా వ్యవహరిస్తున్నారు. అదే విధంగా డిప్యూటీ తహసీల్దార్ల పోస్టులు 14 మండలాల్లో ఖాళీగా ఉన్నాయి.
- జిల్లా సర్వేల్యాండ్ రికార్డు కార్యాలయం పరిధిలో మండల స్థాయి సర్వేయర్ల కొరత తీవ్రంగా వేధిస్తోంది. ఇటీవల ప్రభుత్వం భూ వివాదాల సర్వేలను కొలిక్కి తేవడానికి చర్యలు తీసుకోగా ఈ పోస్టుల కొరతతో దానికి తీవ్ర ఆటంకం కలుగుతోంది. 27 మండల సర్వేయర్లు ఉండగా కేవలం 15 మంది మాత్రమే పనిచేస్తున్నారు. 12 మండలాలు ఖాళీగా ఉన్నాయి. ఇదే కార్యాలయం జూనియర్ అసిస్టెంట్, సీనియర్ అసిస్టెంటు పోస్టులు ఖాళీగా ఉన్నాయి.



వెట్టిచాకిరీ నిర్మూలనపై వాల్‌పోస్టరును విడుదల చేస్తున్న జేసీ ధాత్రిరెడ్డి, ఇతర అధికారులు

వెట్టి చాకిరీ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి : జేసీ


ఏలూరు, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): పరిశ్రమలు, ఇళ్లల్లో బాల, బాలికలతో పని చేయించడం చట్టరీత్యా నేరమని, వారు తప్పనిసరిగా చదువుకునే విధంగా చట్టాలు ఉన్నాయని జేసీ పి.ధాత్రిరెడ్డి అన్నారు. శుక్రవారం వెట్టిచాకిరీ వ్యవస్థ నిర్మూలన దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్‌లో వాల్ పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించి మాట్లాడారు. జిల్లాలో వెట్టిచాకిరీ వ్యవస్థ నిర్మూలనకు ప్రత్యేక డ్రైవ్‌ను నిర్వహించాలన్నారు. సమాజంలో వెట్టిచాకిరి కార్మిక వ్యవస్థను పూర్తిగా నిర్మూలించేందుకు ప్రతీ ఒక్కరూ పాటుపడాలన్నారు. ఉప కార్మిక కమిషనర్ పి.శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ శ్రీనివాస్, ఆర్డీవో అచ్యుత అంబరీష్, మహిళా పోలీస్ ఎస్ఐ కాంతిప్రియ, ఐసీడీఎస్ పీడీ శారద, డీసీపీవో సూర్యచక్రవేణి, కార్మికశాఖ అధికారులు పాల్గొన్నారు.

పంచాయతీలకు.. నిధుల పండగ!



- ఆర్థిక సంఘం నిధులు రూ.33.25 కోట్లు విడుదల
- గత ప్రభుత్వంలో దారి మళ్లింపు
- సక్రమంగా వినియోగిస్తే గ్రామాలకు మహర్దశ

ఏలూరు రూరల్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ పాలనలో పూర్తిగా నిర్వీర్యమైన పంచాయతీలు కూటమి సర్కార్ చొరవతో మళ్లీ జీవం పోసుకుంటున్నాయి. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పంచాయతీలకు 2024-2025 ఆర్థిక సంఘం నిధులను ఇటీవల విడుదల చేయడంతో పంచాయతీలు ఆర్థికంగా పరిపుష్టిని సంతరించుకోనున్నాయి. జిల్లాలో 544 పంచాయతీలకు గాను రూ.33.25 కోట్లు విడుదలయ్యాయి. సర్పంచ్‌లు కొలువుతీరిన తర్వాత అప్పట్లో అధికారంలో ఉన్న వైసీపీ ప్రభుత్వం పంచాయతీలను పట్టించుకోలేదు. నిధుల లేమితో పంచాయతీలో వీధిలైట్లు సైతం మార్చలేని స్థితికి వెళ్లాయి. సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చి సర్పంచ్‌లను పూర్తిగా కీలుబొమ్మలుగా మార్చారు. కేంద్రం కేటాయించిన ఆర్థిక సంఘం నిధులను వైసీపీ సర్కారు దారి మళ్లించడంతో పంచాయతీల నిధులు లేమితో కొట్టుమిట్టాడాయి. ఎన్నికలకు ముందు చంద్రబాబు నాయుడు పంచాయతీల దుస్థితిని చూసి అధికారంలోకి రాగానే పంచాయతీ లకు మంచి రోజులు తీసుకొస్తామని హామీ ఇచ్చారు. అధికారంలోకి రాగానే నిధులు విడుదల చేసి పంచాయతీలను ఆదుకుంటామని ఇచ్చిన హామీ మేరకు కేంద్రం చొరవతో కూటమి సర్కార్ తొలివిడతగా ఆర్థిక సంఘం నిధులను విడుదల చేసింది.



అభివృద్ధివైపు అడుగులు..

ఎన్నికల ముందు చంద్రబాబు పంచాయతీల అభివృద్ధికి పెద్దపీట వేస్తామన్నారు. ప్రభుత్వం వచ్చి ఏడునెలలు గడవక ముందే పంచాయతీలకు నిధులు విడుదల చేయడం సంతోషదాయకం. పంచాయతీల అభివృద్ధికి నిధులు వినియోగిస్తాం. గ్రామాల్లోని ప్రధాన సమస్యల పరిష్కారానికి ఈ నిధులు దోహదపడతా యి. ముఖ్యమంత్రి, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు.

- పాలడుగుల లక్ష్మణరావు, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పంచాయతీల సంఘం అధ్యక్షుడు



సౌభాగ్యలక్ష్మిగా అచ్చమ్మ పేరాంటలమ్మ

దెందులూరు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : గాలాయగూడెం గ్రామ దేవత అచ్చమ్మ పేరంటలమ్మ 68వ వార్షికోత్సవాల్లో భాగంగా నాల్గవ రోజు అమ్మ వారిని 19 వేల గాజులతో సౌభాగ్యలక్ష్మిగా అలంకరించారు. ఆలయ ప్రధాన అర్చకుడు తిప్పాభట్ల సత్య నారాయణ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిపారు. అమ్మవారిని పలువురు ప్రముఖులు, వందలాది మంది దర్శించుకున్నారు. బాయ్స్ అరెస్ట్రా నిర్వహణలో సినీ గాయని ఉమనేహా ప్రత్యేక సంగీత కార్యక్రమం నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు ఆమెను ఘనంగా సన్మానించారు.

కల్లు గీత మద్యం లైసెన్సులకు 135 దరఖాస్తులు

- నేటితో గడువు ముగింపు

ఏలూరు, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి):జిల్లాలో కల్లుగీత కార్మికుల ఉపకులాలకు రిజర్వ్ చేసిన 14 మద్యం దుకాణాల లైసెన్సులకు దరఖాస్తుదారుల నుంచి విశేష స్పందన వస్తోంది. గురువారం నాటికి 54 మంది దరఖాస్తు చేయగా, శుక్రవారం ఒకరోజే ఏకంగా 81 దరఖాస్తులను అందించడంతో జిల్లాలో దరఖాస్తుల సంఖ్య 135కు చేరింది. రాష్ట్రస్థాయిలో షాపులకు వచ్చిన దరఖాస్తుల్లో ఏలూరు మూడో స్థానంలో నిలిచిందని ఏలూరు ప్రొహిబిషన్, ఎక్సైజ్‌శాఖ సూపరింటెండెంట్ ఆనాల ఆవులయ్య తెలిపారు. దరఖాస్తు గడువు చివరి తేదీ ఈ నెల 8న శనివారం సాయంత్రం 5 గంటల నాటికి మరికొన్ని పెరిగే అవకాశం ఉంది. 9న దరఖాస్తులను పరిశీలన చేసి, 10న ఏలూరు మినీబైపాస్ రోడ్డులోని చలసాని గార్డెన్స్‌లో డ్రా తీసి షాపులకు లైసెన్సులు జారీ చేయనున్నారు.

భోజన పథకానికి.. ఇక సన్నబియ్యం

ఏలూరు అర్బన్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో బాలబాలికలకు అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకంలో ఇకమీదట సన్నబియ్యాన్ని వినియోగించాలని మంత్రివర్గ సమావేశంలో తాజా తీసుకున్న నిర్ణయంతో జిల్లాలో దాదాపు 92 వేల మంది విద్యార్థులకు ప్రయోజనం చేకూరుతుందని ప్రాథమికంగా అంచనా వేశారు. జిల్లావ్యాప్తంగా మొత్తం 1,750 ప్రభుత్వ పాఠశాలలుండగా, మొత్తం 95 వేలమంది చదువుతున్నారు. వీరిలో సరాసరిన రోజుకు 92 వేల మంది విద్యార్థులు భోజన పథకాన్ని వినియోగించుకుంటున్నారు. ప్రస్తుతం భోజన పథకానికి ఐరన్, ఫోలిక్ యాసిడ్, విటమిన్ బీ12 వంటి పోషక విలువలతో మిళితమైన పోర్టిఫైడ్ బియ్యాన్ని పౌరసరఫరాల శాఖ ద్వారా పాఠశాలలకు పంపిణీ చేస్తున్నారు. ఒకటో తరగతి నుంచి ఆరో తరగతి వరకు ప్రాథమిక తరగతుల బాల బాలికలకు ఒకొక్కరికి రోజుకు 100 గ్రాముల చొప్పున, ఏడో తరగతి నుంచి పదో తరగతి వరకు ఒక్కొక్కరికి 150 గ్రాములు, ఇంటర్ చదివే విద్యార్థులకు 200 గ్రాముల చొప్పున లెక్కించి నెలవారీగా పాఠశాల హెచ్ఎంలు పంపే ఇండెంట్ ద్వారా పోర్టిఫైడ్ బియ్యాన్ని ఆహార పదార్థాల తయారీ నిమిత్తం అందజేస్తున్నారు. మధ్యాహ్న భోజన పథకంలో రాష్ట్రవ్యాప్తంగా ఒకే మెనూ అమలు చేస్తుండడం వల్ల ఆయా ప్రాంతాల్లో విద్యార్థులు రుచించక డస్ట్‌బిన్‌లో పడేస్తున్న విషయం ప్రభుత్వ దృష్టికి వచ్చింది. ఈ నేపథ్యంలో భోజన పథకంలో ఆహార వృథాను అరికట్టే చర్యలను కూటమి ప్రభుత్వం చేపట్టింది. ఈ క్రమంలోనే పిల్లలు ఇష్టపడి తినే ఆహారాలను వడ్డించాలని నిర్ణయించింది. ఆ మేరకు రాష్ట్రంలో జోన్ల వారీగా ఆయా జిల్లాల్లో స్థానిక వంటకాలకు అనుగుణంగా మెనూలో మార్పులను చేసింది. ఇందులో భాగంగానే త్వరలో పోర్టిఫైడ్ బియ్యంస్థానే సన్నబియ్యాన్ని భోజన పథకానికి సరఫరా చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనిపై జిల్లా విద్యాశాఖ వర్గాలు స్పందిస్తూ 'భోజన పథకానికి సన్నబియ్యం సరఫరా చేస్తున్నట్టు ఇంత వరకు ఉన్నతాధికారుల నుంచి ఎటువంటి సమాచారం లేదు.' అని వివరించాయి.

త్వరితగతిన సమస్యల పరిష్కారం : ఎస్పీ

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): సిబ్బంది సమస్యలు త్వరితగతిన పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్టు ఎస్పీ కేపీఎస్ కిశోర్ అన్నారు. పోలీస్ సిబ్బంది శాఖాపరమైన సమస్యల పరిష్కారానికి శుక్రవారం పోలీస్ సిబ్బంది సంక్షేమ దివాస్ కార్యక్రమాన్ని జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించారు. జిల్లాలోని సివిల్, ఎఆర్, హోంగార్డ్స్ పలువురు వచ్చి తమ సమస్యలపై వినతులను అందించారు. వారి సమస్యలను త్వరగా పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎస్పీ తెలిపారు.





నిట్‌లో ఉత్సాహంగా కల్చరల్ ఫెస్ట్



తాడేపల్లిగూడెం అర్బన్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : నిట్‌లో ఉల్కన్‌జి కల్చరల్ ఫెస్ట్ -25 కార్యక్రమం రెండో రోజు ఉత్సాహంగా జరిగింది. శుక్రవారం విద్యార్థులు పలు ప్రయోగాలు, మట్టితో రకరకాల బొమ్మలు, పెయింటింగ్ వంటి ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. సాయంత్రం విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.



ఇదేనా రక్షణ.. ?

ఎండలు పెరుగుతున్నాయని చెప్పేందుకు.. నిబంధనలు మీరి రవాణా వాహనంలో మహిళలను తీసుకుని వెళుతున్నందుకు ఈ చిత్రమే నిదర్శనం. ఓ శుభ కార్యక్రమం నిమిత్తం మహిళలను పెద్ద సంఖ్యలో ఈ టాటా ఏస్ వాహనంలో వుంచి తీసుకుని వెళుతున్నారు. ఇందులో కొందరు కూర్చోగా, మరికొందరు నిలుచుని ఉన్నారు. ఓ వైపు రహదారి భద్రతా మాసోత్సవాలు జరుపుకుంటూనే ఇలా తీసుకువెళ్లినా అధికారులకు కనిపించడం లేదు. మరోవైపు ఎండల నుంచి రక్షణ కోసం వీరు వాహనం పైన కొబ్బరి మట్టలతో కట్టి రోడ్డుపై పరుగులు పెట్టిస్తున్నారు. ఏలూరు జిల్లా నూజివీడు గాంధీ బొమ్మల సెంటర్‌లో కనిపించిన దృశ్యమిది.



పూజలు నిర్వహిస్తున్న గోస్తనీ తీర్థోత్సవ కమిటీ నాయకుడు గాదిరాజు కృష్ణంరాజు , గ్రామస్థులు

ఘనంగా 94వ గోస్తనీ నది తీర్థోత్సవాలు

పాలకోడేరు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : మోగల్లు శివారు పాలకోడేరులోని నది ఒడ్డున ఉన్న వేంకటేశ్వరస్వామి, రామాలయం వద్ద 94వ గోస్తనీ నది తీర్థోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. తీర్థోత్సవ కమిటీ నాయకులు గాదిరాజు కృష్ణంరాజు (బాబు), సతీమణి మాధవిలు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్ద ఏకాహం భజనలు, కోలాట నృత్యాలు ఏర్పాటు చేశారు. దక్షిణ కాశీగా భావించే ఈ గోస్తనీ నది తీర్థోత్సవాలు అంటే భక్తులకు ఎనలేని నమ్మకం. సుదూర ప్రాంతాల నుంచి వచ్చి తీర్థోత్సవాల్లో పాల్గొని పూజలు చేయడం ఆనవాయితీ. ఉత్సవాలు 9 వరకు జరుగుతాయని 8వ తేదీ శనివారం ఆలయం వద్ద అన్న సమారాధన నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

కమనీయం.. కల్యాణం

వైభవంగా అంతర్వేది లక్ష్మీ నరసింహస్వామి కల్యాణం



పంచముఖ ఆంజనేయ స్వామి వాహనంపై స్వామివారి గ్రామోత్సవం

అంతర్వేది, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): కల్యాణోత్సవ శోభతో అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి క్షేత్రం శోభిల్లింది. సకల దేవతల ఆశీర్వచనాలతో వేద మంత్రోచ్చరణల మధ్య నరసింహస్వామి వారు ఉభయ దేవేరులైన భూదేవి, శ్రీదేవిలను కల్యాణమాడారు. వైష్ణవ సంప్రదాయం ప్రకారం ఆలయ స్థానాచార్యులు వింజమూరి రామలింగాచార్యులు, ప్రధాన అర్చకులు పాణింగపల్లి శ్రీనివాసకిరణ్, వేదపండితులు చింతా వేంకటశాస్త్రి వారి సమక్షంలో అర్చక బృందం పేరూరు ఉద్దండ పండితులు కల్యాణం నిర్వహించారు. శుక్రవారం దశమి రాత్రి 12:55 గంటలకు (తెల్లవారితే శనివారం) మృగశిర నక్షత్రయుక్త వృశ్చిక లగ్నమందు శుభ ముహూర్తానికి జీలకర్ర, బెల్లం స్వామివారి శిరస్సుపై ఉంచారు. ఆలయం ముందు నిర్మించిన శాశ్వత షెడ్లలో భక్తులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు ఆశీనులై స్వామి వారి కల్యాణం వీక్షించారు.

ఎదురు సన్నాహంతో శ్రీకారం..

రాత్రి 11 గంటలకు ఎదురు సన్నాహంతో కల్యాణ తంతు ప్రారంభమైంది. పశ్చిమగోదావరి జిల్లా మొగల్తూరుకు చెందిన ఆలయ ఫౌండర్, ఫ్యామిలీ మెంబరు రాజాకలిదిండి కుమార రామగోపాలరాజాబహదూర్ శ్రీవారి తరఫున, అర్చక స్వాములు అమ్మవారి తరఫున వివాహకర్తలుగా వ్యవహరించారు. తొలుత స్వామివారిని తర్వాత అమ్మవార్లను పల్లకీలో వేర్వేరుగా కల్యాణ మండపానికి తీసుకువచ్చారు. శ్రీవారు-అమ్మవార్లకు అంతర్వేదికు చెందిన డాక్టర్ పోతురాజు సూర్యవెంకట సత్యనారాయణ, కుటుంబీకులు గతంలో ఇచ్చిన ఆభరణాలను అర్చకులు అలంకరించారు. తలంబ్రాలను పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన పొలమూరి కుటుంబీకులు తీసుకువచ్చారు. దేవస్థానం తరపున ఆలయ అధికారులు, ప్రభుత్వ ప్రతినిధిగా రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్, రాజా బహదూర్, కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్, జేసీ టి.నిషాంతి, అమలాపురం ఆర్డీవో కె.మాధవి ఎస్పీ బి.కృష్ణారావు, ఆలయ అధికారులు, భక్తులు శ్రీస్వామి-అమ్మవార్లకు మధు పర్కాలు సమర్పించారు. స్వామి వారి దివ్య తిరు కల్యాణ మహోత్సవాల్లో భాగంగా తిరుమల తిరుపతి దేవస్థానం, శృంగేరీ పీఠం, అన్నవరం దేవస్థానాల నుంచి వచ్చిన అధికారులు పట్టు వస్త్రాలు సమర్పించారు. పట్టు వస్త్రాలను ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ, అర్చకులు కల్యాణ మహోత్సవానికి తీసుకువెళ్లారు. కల్యాణోత్సవాల్లో భాగంగా సాయంత్రం 4 గంటలకు పంచముఖ అంజనేయ స్వామివారి వాహనంపై స్వామివారి గ్రామోత్సవం ఘనంగా జరిపారు. రాత్రి 9 గంటలకు కంచుగరుడ వాహనంపై గ్రామోత్సవం జరిగింది.

నేడు రథోత్సవం

శుక్రవారం రాత్రి స్వామివారి కల్యాణం అనంతరం శనివారం భీష్మఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని స్వామివారి రథోత్సవం ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. మధ్యాహ్నం 2.05 గంటలకు స్వామివారి రథోత్సవం ప్రారంభం కానుంది. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు శుక్రవారం రాత్రికే రథం వద్ద అరటిపండ్లు, గుమ్మడికాయలు, ధాన్యం కుచ్చులను వాహనకారులకు అందజేశారు. వాటితో వాహనకారులు రథాన్ని అలంకరించారు.

భక్తుల పవిత్ర పుణ్యస్నానాలు

రథసప్తమి రోజు మొదలుకుని తొమ్మిది రోజులు వేకువజామున భక్తులు మాఘమాసం సందర్భంగా సముద్రస్నానాలు ఆచరించడం ఆనవాయితీగా వస్తోంది.స్నానాలు ఆచరించిన భక్తులు స్వామివారిని దర్శించుకునేందుకు క్యూలైన్లలో బారులు తీరారు. కృష్ణా జిల్లా నుంచి రెండు రోజుల ముందే వచ్చిన భక్తులు కల్యాణ మండపం సమీపంలో నిద్రచేశారు..



టీటీడీ దేవస్థానం తరపున పట్టు వస్త్రాలు అందిస్తున్న టీటీడీ సభ్యులు



కల్యాణ మండపం వద్ద వేచి ఉన్న కృష్ణా జిల్లా నుంచి వచ్చిన భక్తులు

నేడు భీష్మ ఏకాదశి



కామవరపుకోట, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : భీష్మ ఏకాదశి పర్వదినం ఈనెల 8వ తేదీ శనివారం జరుగుతుందని లలితా శ్రీపీఠం వ్యవస్థాపక అధ్యక్షుడు సుదర్శనం రామదుర్గ కుమారాచార్యులు తెలిపారు. భీష్మ ఏకాదశి ప్రాముఖ్యతను వివరించారు. మహా భారతంలో భీష్ముడు కురుక్షేత్రంలో బాణాలతో చేసిన అంపశయ్యపై ఉండి ఉత్తరాయణం ప్రారంభమయ్యే వరకు వేచి ఉంటాడు. ఉత్తరాయణం ప్రారంభమయ్యాక మాఘశుద్ధ అష్టమినాడు భీష్ముడు తన దేహాన్ని వదిలివేయడం ప్రారంభించాడు. భీష్మ ఏకాదశి రోజు పూర్తిగా తన దేహాన్ని వదలి స్వర్గానికి వెళతాడు. ఈ రోజున మహావిష్ణువును, లక్ష్మీదేవిని ఆరాధించడం ద్వారా తలపెట్టిన ప్రతీ కార్యంలోను విజయం సాధించవచ్చని చెప్పారు. ఈ రోజున చేసే దాన ధర్మాలకు మంచి ఫలితాలు ఉంటాయని తెలియజేశారు.



గోదావరిలో ప్రయాణికులతో పంటు

పంటుపై అంతర్వేదికి యాత్రికులు

నరసాపురం టౌన్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): అంతర్వేది నరసింహస్వామి కల్యాణాన్ని తిలకించేందుకు శుక్రవారం పట్టణంలోని మాధవాయిపాలెం రేవు గుండా భారీగా యాత్రికులు తరలి వెళ్లారు. దీంతో రేవు కిటికటలాడింది. ఎటువంటి సంఘటనలు జరగకుండా పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. పంటులో పరిమితికి మించి ఎవరినీ ఎక్కించడం లేదు. దీంతో రేవు దాటేందుకు గంటల తరబడి యాత్రికులు నిరీక్షించాల్సి వచ్చింది. మరోవైపు భక్తులు పెద్ద సంఖ్యలో పట్టణం గుండా వెళ్ళడంతో అంతర్వేది వెళ్లడంతో స్టీమర్‌రోడ్ సందడిగా మారింది. కల్యాణన్ని తిలకించి తిరుగుముఖం పట్టే యాత్రికులకు అల్పాహారం అందించేందుకు కూటమి పార్టీలతో పాటు స్వచ్ఛంద సంస్థలు ఏర్పాటు చేస్తున్నారు. స్టీమర్‌రోడ్‌లో టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల నాయకులకు అల్పాహారం అందించనున్నారు.

కొపనాతి కృష్ణమ్మ గజమాల యాత్రకు ర్యాలీగా వెళ్లిన అగ్నికుల క్షత్రియులు



యలమంచిలి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): అంతర్వేది లక్ష్మీ నర్సింహస్వామి ఆలయ నిర్మాత కొపనాతి కృష్ణమ్మ గజమాల యాత్రలో పాల్గొనేందుకు మండలంలోని అగ్నికుల క్షత్రియులు శుక్రవారం బైక్‌లపై ర్యాలీగా తరళివెళ్లారు. యలమంచిలి ప్రధానకూడలి వద్ద ఉన్న కొపనాతి కృష్ణమ్మ విగ్రహానికి అగ్నికులక్షత్రియ సంఘాల నాయకులు పాలాభిషేకం చేసి, పూలమాలలు వేశారు. బర్రే ప్రసాద్, మల్లాడి ధర్మరాజు, కొల్లు పేతురు, నాగరాజు, తిరుమాని ఆదికృష్ణ, రామకృష్ణ, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నారసింహుని కల్యాణోత్సవాలకు సర్వం సిద్ధం

నేడు వరుడు కానున్న నరసన్న

ముస్తాబైన సుందరగిరి



ద్వారకాతిరుమల, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): లక్ష్మీ నరసింహుని దివ్య క్షేత్రంలో శనివారం నుంచి ప్రారంభం కానున్న కల్యాణ మహోత్సవాలకు సర్వం సిద్ధమైంది. శనివారం ఉదయం 10 గంటలకు స్వామివారిని పెండ్లి కుమారునిగా, కనకవల్లీ, లక్ష్మీ అమ్మవార్లను పెండ్లికుమార్తెలుగా చేయనున్నారు. చిన వెంకన్న ప్రధాన ఆలయానికి దత్తత దేవాలయమైన ఐఎస్ జగన్నాధపురంలోని సుందరగిరిపై కొలువైన ఆలయంలో భీష్మ ఏకాదశి పర్వదినం మొదలుగా ఈనెల 13 వరకూ కల్యాణ మహోత్సవాలు జరుగనున్నాయి. ఆలయ పరిసరాలను విద్యుద్దీపాలతో సుందరీకరించారు. ఆలయ ప్రాంగణంలో పందిళ్లు, ప్రత్యేక క్యూలైన్ల పనులు పూర్తయ్యాయి. ఈనెల 10న ఉదయం 11-10 గంటలకు స్వామివారి కల్యాణాన్ని కొండ దిగువనున్న కల్యాణ మండపంలో నిర్వహిస్తామని అధికారులు తెలిపారు.



ఉపాధి హామీలో పశుగ్రాసం సాగు

జాబ్‌కార్డు ఉన్నవారికి అవకాశం

గ్రామ సభల ద్వారా లబ్ధిదారుల ఎంపిక

ఏలూరు రూరల్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం కింద పశుగ్రాసం పెంచుకోవడానికి ప్రభుత్వం వెసులుబాటు కల్పించింది. గతంలో 2014 నుంచి 19 వరకు తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడు పశుగ్రాసం పథకాన్ని అమలు చేసింది. అనంతరం అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం దీన్ని రద్దు చేసింది. రైతులకు ఎంతో ఉపయోగపడే ఈ పథకాన్ని కూటమి ప్రభుత్వం పునరుద్ధరించింది. ఉపాధి హామీ పథకం జాబ్‌కార్డులు ఉండి పది సెంట్లకు తగ్గకుండా సొంత భూమి ఉన్న రైతులంతా ఈ పథకం కింద లబ్ధి పొందడానికి అర్హులు. కొద్దిపాటి వ్యవసాయ భూమి ఉండి, పాడిపశువుల పోషణ ద్వారా కుటుంబాలను పోషించుకుంటున్న చిన్న, సన్నకారు రైతులకు ఉచిత పశుగ్రాసం, సాగు పథకాన్ని కూటమి ప్రభుత్వం అమల్లోకి తెచ్చింది. ఉపాధి హామీ పథకాన్ని అనుసంధానం చేస్తూ విధివిధానాలు రూపొందించింది. కనిష్ఠంగా 10 సెంట్లు, గరిష్ఠంగా 50 సెంట్ల వరకు పశుగ్రాసం పెంచుకోవచ్చు. ఇప్పుడు పశుగ్రాసం సాగు చేపడితే వేసవి ఆరంభం నుంచి పచ్చగడ్డి అందుబాటులోకి వస్తోంది. ప్రతి మండలంలో 40 నుంచి 50 ఎకరాల వరకు పశుగ్రాసం పెంచడానికి పశు సంవర్ధక శాఖ అధికారులు రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఉపాధి హామీ జాబ్‌కార్డు ఉన్నవారు మాత్రమే ఈ పథకానికి అర్హులు. పదిసెంట్ల విస్తీర్ణంలో పశుగ్రాసం సాగు చేస్తే ఉపాధి కూలీ వేతనంగా రూ.3 వేలు, మెటీరియల్ ఖర్చుగా రూ.3,599 కలిపి మొత్తం రూ.6,599 ప్రభుత్వం ఇస్తోంది. 50 సెంట్ల విస్తీర్ణంలో పశుగ్రాసం సాగుచేస్తే కూలీల వేతనంగా రూ.15 వేలు, మెటీరియల్ ఖర్చు రూ.17,992, మొత్తం రూ.32,992 పొందవచ్చు. ఆసక్తి ఉన్న రైతులు సమీపంలోని పశువైద్య కేంద్రాలతో పాటు రైతుసేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవచ్చు.జాబ్‌కార్డు, పొలానికి సంబంధించి 1బీ అడంగల్, ఆధార్ కార్డు, రేషన్‌కార్డు, బ్యాంకు పాస్ పుస్తకం జిరాక్స్ కాపీలు జత చేయాలి. గ్రామసభల ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేస్తారు. పశుగ్రాసం సాగు చేపట్టిన తర్వాత ఉపాధి హామీ పథకం అధికారులు, పశువైద్యులు పరిశీలించి ధ్రువీకరించిన అనంతరం రైతులకు బిల్లులు మంజూరవుతాయి.



ఆదర్శ గురుకులం

ఇక్కడ చదువుకునేందుకు విద్యార్థులు పోటీ పడతారు.. చదువే కాదు.. ఆట పాటలతో పాటు ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇస్తారు. విద్యాబుద్ధులతో పాటు క్రమ శిక్షణకు ప్రాధాన్యం ఇస్తారు. అందుకే ఏటా లక్ష్యం కంటే ఎక్కువ మంది విద్యార్థులు ఇక్కడ చేరుతుంటారు.. రాష్ట్రంలోనే ఆదర్శ స్కూల్‌గా నిలుస్తున్న పెదతాడేపల్లిలోని అంబేద్కర్ గురుకుల పాఠశాలపై కథనం..

- రాష్ట్రంలోనే బెస్ట్ గురుకులంగా గుర్తింపు
- పేద విద్యార్థులకు మొదటి ఛాయిస్ ఇదే
- ఉత్తమ బోధన, క్రమశిక్షణ
- చదువుతో పాటు ఆరోగ్యానికి ప్రాధాన్యం
- అంబేద్కర్ గురుకులానికి తగ్గని క్రేజ్

తాడేపల్లిగూడెం రూరల్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి):తాడేపల్లిగూడెం మండలం పెదతాడేపల్లి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల అన్నిటిలో మేటిగా నిలుస్తూ రాష్ట్రంలోనే ఆదర్శ పాఠశాలగా ఖ్యాతి పొందుతోంది. ఇటు చదువు, మరో వైపు ఆటలు, ఇంకోవైపు కళలు, రివార్డులు, రికార్డులు ఒకటేమిటి అన్నిటా బెస్ట్‌గా నిలుస్తోంది.ప్రిన్సిపాల్ రాజారావు తన అనుభవాన్ని రంగరించి ఈ పాఠశాలను మేటిగా తీర్చిదిద్దారు. 2017లో ఏర్పడిన ఈ గురుకుల పాఠశాల నేటికీ అన్నింటా ముందుకు సాగుతోంది. ఈ పాఠశాలలో 480 మంది విద్యార్థులు చదువుకునేందుకే అవకాశం ఉండగా 538 మంది విద్యార్థులు చదువుతున్నారు. పాఠశాలలో ఉండాల్సిన విద్యార్థుల లక్ష్యం కంటే 58 మంది అధికంగా ఇక్కడ చదువుతున్నారంటే ఇక్కడ సీటు కోసం ఏ స్థాయిలో పోటీ ఉందో అర్థం అవు తుంది. పదో తరగతి విద్యార్థులు నూరుశాతం ఉత్తీర్ణత సాధించడంతో పాటు ఏ గ్రేడ్ విద్యార్థులు అధికమే. పాఠశాలకు మరో ప్రత్యేకత ఉంది. ఆర్మీలోనే ఎంతో ప్రత్యేకంగా భావించే పైప్ బ్యాండ్ ఈ పాఠశాల సొంతం. రాష్ట్రంలో ఫస్ట్‌తో పాటు దేశంలో అత్యున్నత కార్పొరేట్ పాఠశాలల నుంచి వెళ్లిన పైప్ బ్యాండ్‌లకు ఏమాత్రం తీసిపోకుండా దేశ స్థాయిలో ద్వితీయ బహుమతి సాధించడం ఓ రికార్డు. విద్యార్థులు ఒత్తిడి తట్టుకోవడానికి స్లీపింగ్ పిరియడ్, ఆరోగ్యం కాపాడటానికి అవసరమైన మంచినీరు తాగేందుకు వాటర్ బెల్ ఏర్పాటు చేయడం ఆరోగ్యానికి ఎంత ప్రాధాన్యం ఇస్తారో అర్థం అవుతుంది.

అన్నిటా మేటి..

ఇక్కడి విద్యార్థులకు చదువుతో పాటు వారికి ప్రత్యేక శిక్షణ ఇస్తుంటారు. కరాటే, యోగాసనాలతో పాటు పైప్ బ్యాండ్‌లే కాక తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో కూడా ఈ పాఠశాల విద్యార్థులకు ప్రత్యేక స్థానం ఉంది. అన్నిటిలోనూ మేటి అనిపించుకోవాలనే తపన, తాపత్రయం ఈ పాఠశాలకు అదనపు అర్హత. గురుకుల పాఠశాల విద్యార్థి పి.మధుకర్ వరల్డ్ మెమరి ఛాంపియన్‌షిప్‌లో 4వ స్థానంలో నిలిచారు. జాతీయ స్థాయిలోనే మొదటి బహుమతి సాధించిన ఈ విద్యార్థి ప్రపంచ స్థాయిలో గుర్తింపు సాధించాడు. కరాటేలో సీహెచ్ గౌరవ్ శ్యాందీపక్ గోల్డ్‌మెడల్, సిల్వర్ మెడల్ సాధించాడు.

కార్పొరేట్ పాఠశాలల్లో సీట్లు

కేంద్ర ప్రభుత్వం దేశంలో ప్రఖ్యాత గాంచిన కార్పొరేట్ పాఠశాలల్లో అర్హత కోసం నిర్వహించే శ్రేష్ఠ పరీక్షల్లో ఈ పాఠశాల విద్యార్థులు 224 మంది దేశంలోని ఆరు రాష్ట్రాల్లోని కార్పొరేట్ పాఠశాలల్లో ఉచితంగా చదువుకునేందుకు అర్హత సాధించారు. వాటితో పాటు పదో తరగతిలో ప్రతిభ కనబరిచిన 10 మంది విద్యార్థులు ట్రిపుల్ ఐటీ విద్యా సంస్థల్లో సీట్లు సాధించారు.





శ్రేష్ఠ అర్హత పరీక్షల్లో విజయం సాధించిన విద్యార్థులు (ఫైల్)... భోజనాలు చేస్తూ..

• క్రమశిక్షణ, ప్రణాళికాబద్ధమైన బోధన



మా పాఠశాల విద్యార్థులు అన్నిటా ముందుండాలనే తపనతో ఎనిమిదేళ్లుగా ఎప్పటికప్పుడు విద్యార్థులకు అవసరమైన బోధన అందిస్తున్నాం. ఒత్తిడి తట్టుకునే విధంగా తరగతులు నిర్వహిస్తాం. రికార్డులు, రివార్డుల కంటే విద్యార్థుల భవిష్యత్ దృష్టిలో ఉంచుకుని చదువుపై శ్రద్ధ చూపేలా చూస్తాం.

-బి.రాజారావు, ప్రిన్సిపాల్, గురుకుల పాఠశాల

• అన్ని విషయాలపై అవగాహన



విద్యార్థులకు చదువుతో పాటు అన్ని రకాల విష యాలపై అవగాహన ఉండాలని ఉదయం అసెంబ్లీ నిర్వహించడం, విద్యార్థులచే ఆ రోజు న్యూస్ పేపర్ల నుంచి ప్రధాన వార్తలు చదివించడం వంటివి చేయిస్తాం. అన్ని రకాల సబ్జెక్టు చెప్పడంతో పాటు విద్యార్థులకు ఇంట్రెస్ట్ ఉన్న వాటిలో తర్ఫీదు నిస్తాం. ప్రిన్సిపాల్ సారథ్యంలో పాఠశాల బెస్ట్‌గా పేరు తెచ్చుకుంది.

- పి.సత్తిబాబు, ఉపాధ్యాయుడు

• అన్నిటికీ సమ ప్రాధాన్యం



మాది జంగారెడ్డిగూడెం.ఈ పాఠశాలలో చదువు కోవడం అంటే ఒక ఆర్మీలో శిక్షణ పొందినట్టే. ఇటు చదువులోనూ ఆటల్లోనూ అన్నిటిలో ఇక్కడ సమాన ప్రాధాన్యం ఉంటుంది. క్రమశిక్షణ అలవడుతుంది.

-కలపాల చైతన్య, 9వ తరగతి విద్యార్థి

• ఆటపాటలతో పాటు ఆరోగ్యం



మాది పెదనిండ్రకొలను. మా పాఠశాలలో చదువుతో పాటు ఒత్తిడిని తట్టుకునేందుకు స్లీపింగ్ పిరియడ్, శరీరానికి నీటి అవసరం తెలిపేందుకు వాటర్ బెల్ ఏర్పాటు చేశారు. ఈ పాఠశాలలో చదువు కోవడంతో పాటు ఆటలు, ఆరోగ్యంపై అవగాహన కలిగింది.

-దినేష్ కుమార్, 9వ తరగతి విద్యార్థి



పైప్‌బ్యాండ్‌లో గురుకుల విద్యార్థులు

అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాలి



సమావేశంలో మాట్లాడుతున్న కేంద్రమంత్రి శ్రీనివాస వర్మ

భీమవరం టౌన్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి భారతీయ జనతా పార్టీని పటిష్టం చేయడానికి నూతనంగా ఎన్నికైన పార్టీ మండల అధ్యక్షులు కృషి చేయాలని కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మ అన్నారు. భీమవరంలోని బీజేపీ నరసాపురం పార్లమెంట్ కార్యాలయంలో జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవి అధ్యక్షతన పార్టీ జిల్లా పదాధికారులు, నూతనంగా ఎన్నికైన మండల అధ్యక్షుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. త్వరలో జిల్లాలోని ప్రతి మండలంలోను తాను పర్యటన చేస్తానని, అభివృద్ధికి రోల్ మోడల్‌గా జిల్లాను తీర్చిదిద్దుతానని వర్మ తెలిపారు. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర సంఘటన మంత్రి మధుకర్ జీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిట్ర శివన్నారాయణ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సూర్యనారాయణ రాజు, జిల్లా మాజీ అధ్యక్షుడు తాతాజీ తదితరులు పాల్గొన్నారు.

వన్ నేషన్.. వన్ ఎలక్షన్‌పై ప్రచారం చేయాలి


మాట్లాడుతున్న పురందేశ్వరి

భీమవరం టౌన్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): వన్ నేషన్.. వన్ ఎలక్షన్ అంశంపై రాష్ట్ర వ్యాప్తంగా ప్రచారం చేయాల్సిన అవసరం ఉందని రాజమహేంద్రవరం ఎంపీ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. భీమవరంలో బీజేపీ రాష్ట్ర సంఘటనా ప్రధాన కార్యదర్శి మధుకర్‌జీ, పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేటుకూరి సూర్యనారాయణరాజు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గారపాటి సీతారామాంజనేయ చౌదరి, సుహాసిని సమక్షంలో సమీక్షా సమావేశం జరిగింది.

ఇళ్ల స్థలాల కేటాయింపునకు ఆక్రమణదారుల అడ్డు


ఇళ్ల నిర్మాణాలు చేపట్టిన లబ్ధిదారులు

ద్వారకాతిరుమల, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): ద్వారకాతిరుమలలోని ఆర్ఎస్ నెం: 47లో ముగ్గురు లబ్ధిదారులకు గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు గత వారం పొజిషన్, ఎంజాయ్‌మెంట్ పత్రాలు అందజేసినా ఇక్కడి ఆక్రమణదారులు అడ్డుతగులుతూనే ఉన్నారు. దొరసానిపాడుకు చెందిన సయ్యద్ ఇమామ్ సాహెబ్ కుటుంబానికి అండగా నిలిచిన ఎమ్మెల్యే పట్టాలు అందజేశారు. 30 ఏళ్లుగా భూవివాదంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఈ కుటుంబం తమ సమస్యను ఆయనకు వివరించగా ఆయన స్పందించి ద్వారకాతిరుమలలో వైసీపీకి చెందిన ఓ వ్యక్తి ఆక్రమించుకున్న 20 సెంట్ల భూమిలో 9 సెంట్లను ముగ్గురు లబ్ధిదారులైన సయ్యద్ తాజుద్దీన్, సలీం, షైనుద్దీన్‌లకు కేటాయించారు. ఇలా కేటాయించడం నచ్చని ఆక్రమణదారు స్థానికేతరులన్న అంశాన్ని లేవనెత్తి తహసీల్దారుకు శుక్రవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఇందులో ప్రజా ప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు కలిసి ఇస్తున్న విన్నపం అంటూ ఓ విజ్ఞాపనను తహసీల్దారుకు అందించారు.

విద్యాదాత, పారిశ్రామికవేత్త వెలమాటి మృతి



దెందులూరు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): కొవ్వలి గ్రామానికి చెందిన విద్యాదాత, వెల్లన్ ఇండస్ట్రీస్ సంస్థల అధినేత వెలమాటి చంద్రశేఖర జనార్దనరావు (85) శుక్రవారం హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ మృతి చెందారు. కొవ్వలి గ్రామ అభివృద్ధితో పాటు సుమారు రూ 4 కోట్ల రూపాయలతో కొవ్వలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సదుపాయాలు కల్పించారు. ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధితో పాటు రెడ్‌క్రాస్ భవనాల అభివృద్ధికి సంక్షేమానికి ఆర్థిక సహకారం అందించారు. గతంలో ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి ఏకంగా రూ.20 కోట్ల రూపాయలు అందించారు. అంతేగాకుండా సెప్టెంబరు 9వ తేదీన వరద బాధితుల సహాయార్థం రూ.కోటి రూపాయల చెక్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు అందజేశారు. జనా ర్దనరావు పార్థీవదేహానికి హైదరాబాద్‌లో అంతిమ సంస్కారాలు నిర్వహించనున్నారు. ఈయనకు భార్య, ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. జనార్దనరావు మృతికి ముఖ్యమంత్రితో పాటు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌రావు సంతాపం తెలిపారు. కొవ్వలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం శర్మ, టీడీపీ నేత కసుకుర్తి రామకృష్ణ, గ్రామ దీప్ చైర్మన్ మనోహరి తదితరులు హైస్కూల్‌లో జనార్దనరావు చిత్రపటానికి నివాళులు అర్పించారు.

రక్తదానంతో మరొకరికి పునర్జన్మ

భీమవరం రూరల్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి):రాయలం గ్రామ పంచాయతీలో గల ఇండియన్ రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంకులో రక్తదాన శిబిరం నిర్వహించారు. విద్యాశాఖ అధికారులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా విద్యాశాఖాధికారి ఇ. నారాయణ ప్రారంభించి మాట్లాడుతూ రక్తదానం ఎందరో జీవితాలకు పునర్జన్మ నిస్తుందని, విద్యాశాఖలో పని చేస్తున్న ఆసక్తి గల ఉపాధ్యాయులు, ఇతర సిబ్బంది రక్తదానం చేయాలని, ఒకరిచ్చే రక్తదానం ముగ్గురు జీవితాలను కాపాడుతుందని అన్నారు. శుక్రవారం రాయలంలో రెడ్‌క్రాస్ బ్లడ్ సెంటర్‌లోను, తాడేపల్లిగూడెంలోను, ఫిబ్రవరి 11న నరసాపురం, పాలకొల్లు కేంద్రాల్లోను, 13న తణుకులోను, 14న భీమవరం రాయలంలోని రెడ్‌క్రాస్ బ్లడ్ సెంటర్‌లో రక్త సేకరణ జరుగుతుందని తెలియజేశారు. ఈ 6 క్యాంపుల ద్వారా 300 యూనిట్ల రక్తాన్ని సేకరించాలనేది విద్యాశాఖ లక్ష్యమన్నారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ పశ్చిమ గోదావరి జిల్లా శాఖ చైర్మన్ డాక్టర్ ఎం. శివరామభద్రిరాజు మాట్లాడుతూ శుక్రవారం నాడు 80 మంది రక్తదానం చేశారని, వారందరికి జిల్లా విద్యాశాఖాధికారి చేతుల మీదుగా సర్టిఫికెట్స్ అందించడం జరిగిందన్నారు. గొల్లలకోడేరులోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో జరుగుతున్న ఎఫ్ఎల్ఎన్ శిక్షణ కార్యక్రమం కో-ఆర్డినేటర్, ఎంఈవో ఉంగరాల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో 36 మంది ఉపాధ్యాయులు రక్తదానం చేశారు. భీమవరం ఉప విద్యాశాఖాధికారి నాగరాజు, ఎంఈవో 1 ఎస్.శ్రీనివాస్, వీరవాసరం ఎంఈవో శ్రీమన్నారాయణ, కృష్ణారావు, చిన్నయ్య, కెబి తిరుపతిరాజు, ఫణికుమార్ పాల్గొన్నారు.

నేడు జేఎన్‌వీ ప్రవేశ పరీక్షలు

ఏలూరు అర్బన్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : జవహర్ నవోదయ విద్యాలయ(జేఎన్‌వీ)లో 9, 11 తరగతుల్లో ప్రవేశాలకు పరీక్షలు శనివారం నిర్వహిస్తున్నారు. 9వ తరగతిలో ప్రవేశాలకు ఏలూరులోని కస్తూరిబా, తూర్పువీధి, గాంధీనగర్, ఏఆర్‌డీజీకే మున్సిపల్ హైస్కూళ్లలో ఉదయం 11.15 గంటల నుంచి మధ్యాహ్నం 1.45 గంటల వరకు, 11వ తరగతిలో ప్రవేశాలకు సుబ్బమ్మదేవి మున్సిపల్ హైస్కూలు, పెదవేగి జవహర్ నవోదయ విద్యాలయలో ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు పరీక్షలు జరుగుతాయి. ఈ రెండు పరీక్షలకు మొత్తం 653 మంది విద్యార్థులు దరఖాస్తుచేసుకున్నారు. అడ్మిట్‌కార్డులను నవోదయ వెబ్‌సైట్‌లో విద్యార్థి రిజిస్ట్రేషన్ నెంబరు, పుట్టిన తేదీని నమోదు చేయడం ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవాలని డీఈవో వెంకటలక్ష్మమ్మ సూచించారు. పరీక్ష సమయానికి ఒక గంట ముందుగానే విద్యార్థులు సంబంధిత కేంద్రాలకు చేరుకోవాలని, పరీక్ష ప్రారంభ సమయమైన తర్వాత ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతించబోరన్నారు. విద్యార్థికి అందజేసిన ఓఎం ఆర్ షీటు వారిదో, కాదో సరిచూసుకున్న తర్వా తే సంతకం చేయాలని, బ్లాక్ లేదా బ్లూ కలర్ బాల్‌పాయింట్ పెన్‌తో మాత్రమే బబుల్ చేయాలని సూచించారు. పరీక్షకు సంబంధించి ఏవైనా సందేహాలుంటే డీఈవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్ నెంబర్లు 63030 39477, 94907 28768, 96406 76608, 90785 68664, 80748 33690, 94917 31486లలో సంప్రదించాలి.

8650 క్యూసెక్కులు విడుదల

ధవళేశ్వరం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): రబీ పంట అవసరాల కోసం కాటన్ బ్యారేజ్ నుంచి డెల్టా కాలువలకు 8650 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. తూర్పు డెల్టాకు 2450 క్యూసెక్కులు, మధ్య డెల్టాకు 1800 క్యూసెక్కులు, పశ్చిమ డెల్టాకు 4400 క్యూసెక్కులు చొప్పున జలాలు విడుదల అవుతున్నాయి. ధవళేశ్వరం వద్ద గోదావరి నీటి మట్టం 9.85 అడుగులుగా నమోదు కాగా నీటి లభ్యత 8882 క్యూసెక్కులుగా నమోదయింది.

20కు చేరిన ఎమ్మెల్సీ నామినేషన్ల సంఖ్య

శుక్రవారం అత్యధికంగా 15 మంది నామినేషన్ల దాఖలు


నామినేషన్ దాఖలు చేస్తున్న ఏలూరుకు చెందిన చెక్కా భీమేశ్వరరావు

ఏలూరు, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి) : తూర్పు-పశ్చిమ ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోసం శుక్రవారం 15 మంది అభ్యర్థులు 18 సెట్ల నామినేషన్లను జిల్లా ఎన్నికల అధికారికె వెట్రిసెల్వికి సమర్పించారు. గురువారం నాటికి 5 నామినేషన్లు దాఖలు కాగా, ఈ సంఖ్య 20కు చేరింది. ఇప్పటి వరకు మొత్తం 20 మంది అభ్యర్థులు 24 సెట్ల నామినేషన్లను వేశారు.

ఎన్నికలకు ఏర్పాట్లు

తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్లపై ఏలూరు జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టిపెట్టింది. ఈ సారి ఎన్నికల నిర్వహణ, కౌంటింగ్ ప్రక్రియ అంతా ఏలూరు జిల్లా కలెక్టర్‌కు ఎన్నికల కమిషన్ అప్పగించింది. దీనితో కలెక్టర్ వెట్రిసెల్వి ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా వ్యవహరిస్తున్నారు. ఎన్నికలకు నామినేషన్ల స్వీకరణ ఈ నెల 3న ప్రారంభం కాగా, ఎన్నికల కమిషన్ ఇచ్చిన షెడ్యూల్ ప్రకారం ఈ నెల 8,9వ తేదీలు సెలవు దినాలు అయినందున నామినేషన్ల స్వీకర ణ ఉండదు. దీంతో అధికార యంత్రాంగం పోలింగ్ సిబ్బంది నియామకం, వారికి ఇవ్వాల్సిన శిక్షణలు, బ్యాలెట్ పేపర్లు, ఓటర్ల జాబితాలను సిద్ధం చేయడంపైనే దృష్టి పెట్టారు. 10వ తేదీతో నామినేషన్ల స్వీకరణ పర్వం ముగియనుంది. 11న నామినేషన్ల పరిశీలన చేస్తారు. 13న నామినేషన్ల ఉపసంహరణ, 27నఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 4 గంటల వర కు పోలింగ్ జరగనుంది. మార్చి 3న ఎన్నికల ఓట్ల లెక్కింపును వట్లూరు సర్ సీఆర్‌ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో చేపడతారు. జిల్లాలో మొత్తం 62 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. అయితే వెయ్యి ఓటర్లు దాటిన చోట్ల అదనంగా మరో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసింది. దీంతో జిల్లా కేంద్రమైన ఏలూరు మరో నాలుగు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసే పనిలో అధికార యంత్రాంగం ఉంది.

ఓటర్లు పెరిగే ఛాన్సు

ఆరు జిల్లాల్లోని ఓటర్లలో ఏలూరు జిల్లా ఓటర్ల సంఖ్యలో ఐదో స్థానంలో ఉంది. ఇక్కడ మొత్తం 42,602 మంది ఓటర్లు ఉన్నారు. నామినేషన్ల స్వీకరణ వరకు ఓటర్ల చేర్పులకు అవకాశం ఇవ్వడంతో ఈ సంఖ్య స్వల్పంగా పెరిగే అవకాశం ఉంది.

వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురి ఆత్మహత్య

అనారోగ్యంతో..

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్యంతో బాధపడుతున్న ఒక యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏలూరు టైటస్ నగర్‌కు చెందిన దాసరి సురేష్ (29) ఐటీఐ చేసి ఒక కంపెనీ కేబుల్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. గతంలో డెంగీ జ్వరం వచ్చి కోమాలోకి వెళ్ళాడు. అప్పటి నుంచి తల నొప్పి, ఇతర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. ఈనెల 6వ తేదీన తల నొప్పి విపరీతంగా వస్తుందని కుటుంబ సభ్యులకు చెప్పాడు. రాత్రి అందరూ నిద్రించిన తరువాత అతను ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. టూటౌన్ పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు.

రైలు కింద పడి...

భీమవరం క్రైం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): భీమవరం టౌన్ రైల్వే స్టేషన్ సమీపంలో రైలు పట్టాలపై తలపెట్టి ఒక యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. గుర్తు తెలియని రైలు ఢీకొట్టి వెళ్ళిపోవడంతో శుక్రవారం అక్కడే మృతి చెందాడు. అయితే రైల్వే స్టేషన్ సమీపంలోని ఒక ప్రముఖ హోటల్‌లో జ్యూస్ షాప్‌లో పని చేసే బీహార్ వాసిగా రైల్వే పోలీసులు గుర్తించారు. అతనితోపాటు పనిచేసే మరో బీహార్ వాసి వివరాలు తెలపడంతో కేసు నమోదు చేసి మృతుని తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చినట్లు రైల్వే జీఆర్‌పీ ఎస్ఐ రమణ తెలిపారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామన్నారు.

ఇష్టం లేని వివాహం..

భీమడోలు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : ఇష్టం లేని వివాహం నిర్ణయించారని మనస్తాపానికి గురై ఒక వ్యక్తి పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించాడు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. భీమడోలు మండలం అంబర్‌పేట గ్రామానికి చెందిన సీహెచ్ వంశీకృష్ణ (26) అంబర్‌పేటలోని మిక్సర్ కంపెనీలో పనిచేస్తున్నాడు. ఇతనికి వివాహం నిశ్చయం అయింది. అయితే ఆ వివాహం ఇష్టం లేక మనస్తాపానికి గురై ఈనెల 6వ తేదీ సాయంత్రం కలుపుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించాడు. గమనించిన బంధువులు విజయవాడలోని ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మధ్యాహ్నం మృతి చెందాడు. బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు భీమడోలు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కొట్లాట కేసులో రెండేళ్ల జైలు

పాలకొల్లు అర్బన్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : పట్టణ పోలీస్ స్టేషన్‌లో 2019లో నమోదైన కేసులో కాప సత్యనారాయణ అనే ముద్దాయికి పాలకొల్లు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) ఎస్‌కే జియావుద్దీన్ రెండేళ్ల జైలు, 10వేల జరిమానా విధించారు. పట్టణంలోని సుబ్బారాయుడు గుడి సెంటర్‌లో జరిగిన కోట్లాట కేసులో ముద్దాయి మరో వ్యక్తిని గాయపర్చడంపై పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. నేరం రుజువు కావడంతో ముద్దాయికి కోర్టు జైలు శిక్ష, జరిమానా విధించినట్లు పట్టణ సీఐ కె రజనీ కుమార్ తెలిపారు. ప్రాసిక్యూషన్ తరపున ఏపీపీ జి.అరుణ కుమారి వాదనలు వినిపించారు.

వాహనం నడుపుతుండగా గుండెపోటు

లింగపాలెం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనంపై వెళుతుండగా గుండె పోటు రావడంతో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన కలరాయనగూడెంలో చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మందుల రామస్వామి (45) ద్విచక్ర వాహనంపై వెళుతుండగా గుండెపోటు రావడంతో కలరా యనగూడెంలో గ్రామంలో బండి దిగి కూలబ డిపోవడంతో స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారమందించారు. కుటుంబ సభ్యులు వెంటనే స్థానిక డాక్టరు వద్దకు తీసుకువెళ్లగా అప్పటికే మరణించినట్లు తెలి పారు. మృతుని కుమారుడు ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు ఎస్ఐ కే వెంకన్న తెలిపారు.

పోక్సో కేసు నమోదు

జంగారెడ్డిగూడెం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): జంగారెడ్డిగూడెం మండలంలోని ఓ గ్రామానికి చెందిన 14 ఏళ్ల బాలికపై అదే గ్రామానికి చెందిన వ్యక్తి అత్యాచారం చేసిన ఘటనలో బాలిక అమ్మమ్మ ఫిర్యాదు మేరకు పోక్సో, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎస్‌కె.జబీర్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఎనిమిదవ తరగతి చదువుతున్న బాలిక ఈ నెల ఐదవ తేదీన జిరాక్స్ తీయించుకోవడానికి సెంటర్‌కు వచ్చి తిరిగి ఇంటికి వెళ్తుండగా మార్గ మధ్యలో బాలికను వాడపల్లి శ్యామ్ అనే వ్యక్తి ఇంటి దగ్గర దింపుతానని మాయ మాటలు చెప్పి తన ద్వి చక్ర వాహనం ఎక్కించుకున్నాడు. కొంత దూరం వెళ్ళిన తర్వాత కోకో తోటలోకి తీసుకువెళ్ళి బాలికపై అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ ఘటనను బాలిక తన కుటుంబ సభ్యులకు చెప్పడంతో బాలిక అమ్మమ్మతో కలిసి శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో నిందితుడు వాడపల్లి శ్యామ్‌పై పోక్సో, ఎస్సీఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎస్‌కె.జబీర్ తెలిపారు.

సీసీ కెమెరాల్లేని ప్రాంతాలే టార్గెట్..!

- » రోడ్డు పక్కన పార్క్ చేసిన బైక్‌లు క్షణాల్లో మాయం
- » ఆరు జిల్లాల్లో చోరీలు..
- » నెల్లూరులో నలుగురి అరెస్టు
- » 30 లక్షల విలువైన 56 ద్విచక్రవాహనాలు స్వాధీనం

నెల్లూరు (క్రైం), ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): సీసీ కెమెరాల్లేని ప్రాంతాలను ఎంచుకుంటారు.. రోడ్డుపై అటూ ఇటూ తిరుగుతూ సరైన సమయం కోసం ఎదురు చూస్తారు... జనం లేని సమయం చూసి రోడ్డు పక్కన పార్క్ చేసి ఉన్న బైక్‌లను క్షణాల్లో మాయం చేస్తారు. ఇలా ఆరు జిల్లాల్లో బైక్ చోరీలకు పాల్పడుతూ పోలీసులకు సవాల్ విసిరిన ఓ ముఠా ఎట్టకేలకు పట్టుబడింది. నెల్లూరు జిల్లా పోలీసులు ఈ ముఠాలోని నలుగురిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి 56 బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. ఆ వివరాలను నెల్లూరులోని ఉమేష్ చంద్ర కాన్ఫరెన్స్ హాలులో ఎస్పీ కృష్ణకాంత్ శుక్రవారం విలేకరులకు వెల్లడించారు. నెల్లూరు జిల్లా అల్లూరు మండలం నార్త్ ఆములూరుకు చెందిన ఎ శివ గతంలో హత్యా యత్నం, బైక్ దొంగతనాల కేసుల్లో జైలు కెళ్లొచ్చాడు. ఆ తర్వాత శివ, ఆయన చిన్నమ్మ కుమారుడు రవిదుర్గ, పాత నేరస్థులైన అల్లూరు మండలం చౌటపాలెంకు చెందిన కె నాని, హోసన్న కలిసి ఓ ముఠాగా ఏర్పడ్డారు. వారు సీసీ కెమెరాలు లేని ప్రాంతాలను టార్గెట్ చేసుకొని నెల్లూరు, తూర్పుగోదావరి, కడప, ప్రకాశం, బాపట్ల, తిరుపతి జిల్లాల్లో బైక్ దొంగతనాలకు పాల్పడుతున్నారు. నెల్లూరు జిల్లాలో బైక్ దొంగ తనాలు అధికమవడంతో ఎస్పీ కృష్ణకాంత్ ఆదే శాలతో సీసీఎస్ ఇన్‌స్పెక్టర్లు సీహెచ్ సీతారామయ్య, అశోక్, కొడవలూరు సీఐ సురేంద్రబాబు తమ సిబ్బందితో కలిసి ప్రత్యేక నిఘా పెట్టారు. ఈ క్రమంలో ఈ నెల 6న కొడవలూరు మండలం పద్మనాభసత్రం వద్ద వాహనాలు తని ఖీ చేస్తుండగా శివతోపాటు మరో ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. తమదైన శైలిలో విచారించగా.. నెల్లూరు జిల్లాలో 24, తిరుపతిలో 21, ప్రకాశంలో 8, బాపట్ల, తూర్పుగోదావరి, వైఎస్ఆర్ కడప జిల్లాల్లో మూడు బైక్‌లు చోరీ చేసినట్లు వారు అంగీకరించారు. రాష్ట్రవ్యాప్తంగా రూ.30 లక్షలు విలువచేసే 56 బైక్‌లు దొంగలించినట్లు వెల్లడించారు. పోలీసులు వారి నుంచి బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. ఈ ముఠాను పట్టుకోవడంలో కీలకంగా వ్యవహరించిన పోలీసు సిబ్బందిని ఎస్పీ కృష్ణకాంత్ అభినందించి రివార్డులు అందజేశారు.

పోతేపల్లిలో రేషన్ బియ్యం పట్టివేత

ద్వారకాతిరుమల, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని సీహెచ్ పోతేపల్లిలో సివిల్‌సప్లై అధికారులు దాడులు నిర్వహించారు. అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని అధికారులు పట్టుకున్నారు. డీఎస్‌వో సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో సిబ్బంది లారీలో లోడింగ్‌కు సిద్ధంగా ఉన్న 19.80టన్నుల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. కాకినాడకు చెందిన చోడిశెట్టి మహేష్ అనే వ్యక్తి వీటిని కొనుగోలు చేయగా పిఠాపురం మండలం బి ప్రత్తిపాడుకు చెందిన వ్యాన్ డ్రైవర్లు గంగిరెడ్ల శివస్వామి, వీరబాబులు ఈ లోడును తీసుకెళ్తున్నట్లు అధికారులు చెప్పారు. మహేష్ పై ఇప్పటికే పలు కేసులు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. అక్రమంగా ఓ పెంకుటింట్లో అనధికారికంగా బియ్యాన్ని ఉంచి అనంతరం తరలించే క్రమంలో అధికారులు దాడులు చేశారు. లారీతో పాటు బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు.

కాల్వలో వృద్ధురాలి మృతదేహం



యలమంచిలి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): పెనుమర్రు గ్రామంలోని పంటకాలువలో వృద్ధురాలి మృతదేహం శుక్రవారం లభ్యమైనట్లు ఎస్ఐ కె.గుర్రయ్య తెలిపారు. సోషల్ మీడియాలో పోస్టులు పెట్టడంతో ఆమె బంధువులు వచ్చి మృతదేహం పోడూరు గ్రామం కొత్తపేట ప్రాంతానికి చెందిన గొల్లమందల గంగమ్మ(75) గా గుర్తించారు. గంగమ్మ మతిస్థిమితం సరిగాలేదని ఇటీవల ఇంటివద్ద చెప్పకుండా బయటకు వెళ్లిపోతే కుటుంబసభ్యులు చుట్టుపక్కల ప్రాంతాల్లో గాలించి తీసుకువచ్చారు. మరలా ఆమె గురువారం ఉదయం నుంచి కనిపించకుండాపోయింది. ఈ నేపథ్యంలో శుక్రవారం గంగమ్మ మృతదేహం పంటకాలువలో లభ్యమైంది.

దువ్వ ఘటనలో ఇద్దరి అరెస్టు

తణుకు రూరల్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి):దువ్వ గ్రామంలో భజన కళాకారులపై దాడిన చేసిన ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పర్చినట్లు జిల్లా ఎస్పీ అద్నాన్ అస్మి తెలిపారు. శుక్రవారం ఆయన దువ్వ గ్రామంలోని సంఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈసంఘటనకు సంబంధించి బాధితుల నుంచి ఫిర్యాదు తీసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. గ్రామంలో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ పికెట్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గ్రామంలో ఎటువంటి సంఘటనలు జరగకుండా సమస్యలను పోలీసుల దృష్టికి తీసుకురావాలని కోరారు. యువత ఎవరూ గొడవల్లో పాల్గొనవద్దని హితవు పలికారు.

కఠిన చర్యలు తీసుకోవాలి

దువ్వ గ్రామంలో రథ సప్తమి వేడుకల సందర్భంగా గ్రామంలోని సూర్యనారాయణ దేవాలయంలో కోలాటం ఆడుతున్న మహిళలపై దాడి చేసి దుర్భాషలాడిన వ్యక్తులను కఠినంగా శిక్షించాలని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గారపాటి సీతారామాంజేయ చౌదరి డిమాండ్ చేశారు. గురువారం దువ్వ గ్రామంలోని సూర్యనారాయణ దేవాలయ ప్రాంగణంలో కోలాటం జరుగుతున్న సమయంలో జరిగిన దాడికి సంబంధించిన పరిసరాలను శుక్రవారం సాయంత్రం పరిశీలించి, గాయపడిన మహిళలను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. గ్రామంలో కొంత మంది యువకులు ఉద్దేశపూర్వకంగానే మహిళలపై దాడి చేసి బెదిరింపులకు దిగుతున్నారన్నారు. అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. నిందితులపై ఎటువంటి చర్యలు తీసుకున్నారో పోలీసులు తెలపాలని కోరారు. ఈకార్యక్రమంలో విశ్వ హిందూ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవి కుమార్, బీజేపీ నాయకురాలు ముళ్లపూడి రేణుక, పలు హిందూ సంఘాల నాయకులు పాల్గొన్నారు.


విలేకరులతో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గారపాటి

కారు ఢీకొని కూలీకి గాయాలు


సంఘటనా స్థలం వద్ద బోదెలో బోల్తా కొట్టిన కారు

పెంటపాడు, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి) : రోడ్డు పక్కన నిలబడిన వ్యక్తిని కారు ఢీకొట్టిన సంఘటన శుక్రవారం తెల్లవారు జామున పెంటపాడు గ్రామంలో చోటు చేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పెంటపాడు గ్రామానికి చెందిన బిల్లగుర్తి బాబ్జి(62) కూలి పని చేసుకుని జీవిస్తున్నాడు. పనిలోకి వెళ్ళేందుకు ఉదయం 4 గంటలకు తన మోటర్ సైకిల్ పై బయలు దేరి పెంటపాడు ఊరచెరువు వద్ద నిలబడి ఉన్నాడు. అదే సమయంలో భీమవరం వైపు నుంచి తాడేపల్లిగూడెం వైపుకు వెళ్తున్న కారు వేగంగా వచ్చి నిలబడి ఉన్న బాబ్జిని ఢీకొట్టి అనంతరం కొబ్బరిచెట్టును ఢీకొట్టి పక్కనే ఉన్న బోదెలో బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో బాబ్జికి తీవ్రగాయాలవ్వగా, కారులో వస్తున్న వ్యక్తులకు స్వల్పగాయాలు అయ్యాయి. బాదితుడిని రాజమండ్రి ఆసుపత్రికి తరలించారు. పెంటపాడు పోలీసులు వివరాలు నమోదు చేసుకున్నారు.

ఇరు వర్గాల ఘర్షణ

- » ఒకరిపై మరొకరు రాళ్లు, కర్రలతో దాడులు » ముగ్గురికి గాయాలు..
- » ఆసుపత్రికి తరలింపు » పరిస్థితిని అదుపులోకి తెచ్చిన పోలీసులు
- » నరసాపురం అరుంధతీపేటలో ఘటన.. 144 సెక్షన్ విధింపు


అరుంధతీపేటలో రాళ్లు రువ్వుకుంటున్న రెండు వర్గాలు.. ఆందోళనకారులతో చర్చిస్తున్న డీఎస్పీ శ్రీవేద



నరసాపురం టౌన్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి):ఇరువర్గాల మధ్య పెళ్లిలో జరిగిన చిన్న వివాదం చినికి చినికి గాలివానలా మారి ఒకరిపై ఒకరు రాళ్లు రువ్వుకునేంత వరకు వెళ్లింది. ఈ దాడిలో పలువురికి గాయాల య్యాయి. పోలీసులు ఇరు వర్గాలను చెదరగొట్టి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. వారు తెలిపిన వివరాలివి.. నరసాపురం అరుంధతీపేటలో గురువారం రాత్రి ఓ వివాహం జరుగుతోంది. ఈ క్రమంలో బైక్‌పై అటుగా వెళుతున్న ఓ వ్యక్తి హారన్ కొట్టడంతో మొదలైన వివాదం.. రెండు సామాజిక వర్గాల గొడవగా మారింది. అప్పటి నుంచి పేటలో ఉద్రిక్తత నెలకొంది. ఎప్పుడు ఏం జరుగుతుందో ననే పరిస్థితి ఏర్పడింది. శుక్రవారం ఉదయం వరకు చాప కింద నీరులా వున్న రెండు వర్గాలు సాయంత్రం మళ్లీ ఘర్షణలకు దిగాయి. కర్రలు, రాళ్లతో ఒకరిపై ఒక్కరూ దాడికి పాల్పడారు. రెండు వర్గాలు రోడ్డుపై బైఠాయించి ఆందోళనలు చేశారు. నువ్వెంత అంటూ నువ్వె ంత అంటూ కేకలు వేసుకున్నారు. ఒక్కసారిగా రెండు వర్గాల ఘర్షణ తలెత్తడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. భయానక వాతావరణం ఏర్పడింది. అసలు ఏం జరుగుతుందో ఎవరికి అర్థంకాలేదు. అంతర్వేది ఉత్సవాల సందర్భంగా నరసాపురం రేవులో బందోబస్తులో వున్న నరసాపురం డీఎస్పీ శ్రీవేదకు సమాచారం రావడంతో అక్కడ గస్తీ నిర్వహిస్తున్న పోలీసుల్లో కొందరిని ఇటు తీసుకుని వచ్చారు. వీరు ఇరు వర్గాలను చెదరగొట్టారు. అయినప్పటికి రెండు వర్గాలు రాళ్లు రువ్వుకోడం ఆపలేదు. అడ్డువచ్చిన పోలీసులపై రాళ్లు రువ్వారు. దీంతో అదనపు పోలీస్ బందోబస్తును రప్పించి పేటలో మోహరించారు. ప్రస్తుతం పరిస్థితి అదుపులో ఉంది. ఈ ఘటన వివరాలను డీఎస్పీ సేకరిస్తున్నారు. మళ్లీ ఇటు వంటి ఘటనలు జరిగే కఠిన చర్యలు తీసు కుంటామని రెండు వర్గాలను హెచ్చరించారు. ఇక్కడ 144 సెక్షన్ విధించి గస్తీ ఏర్పాటు చేశారు. ఇరు వర్గాల దాడులతో ముగ్గురికి గాయాలయ్యాయి. వీరిని స్థానిక ప్రభుత్వా సుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. రెల్లిపేటకు చెందిన నీలపు చినబాబుపై అరుంధతీపేటకు చెందిన సిర్రా ప్రదీప్ దాడి చేశాడని, అలాగే అరుంధతీపేటకు చెందిన సిర్రా ప్రదీప్ కుమార్‌పై రెల్లిపేటకు చెందిన నీలాపు ప్రసాద్, చిన్నబాబు, భరత్ నాంచారి, రత్నరాజు దాడి చేసి గాయపర్చారని ఇరువర్గాల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

కొల్లేరు ప్రాంత ప్రజలకు న్యాయం చేయండి

» కేంద్ర మంత్రి భూపేంద్రకు ఎంపీ పుట్టా విజ్ఞప్తి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): ఇటీవల సుప్రీంకోర్టు జారీ చేసిన ఆదేశాలపై కేంద్ర ప్రభుత్వం తక్షణం జోక్యం చేసుకుని, కొల్లేరు ప్రాంత ప్రజలకు న్యాయం చేయాలని కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రి భూపేంద్ర యాదవ్‌కు టీడీపీ ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ఇందిరా పర్యావరణ భవన్‌లో కేంద్ర మంత్రిని ఆయన కలిసి వినతిపత్రం అందించారు. 2025 జనవరి 16న సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలతో కొల్లేరు సరస్సు ప్రాంతంలో దీర్ఘకాలికంగా నివసిస్తున్న ప్రజలు భయాందోళనకు గురవుతున్న విషయాన్ని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి కోర్టు జారీ చేసిన ఆదేశాలు 122 గ్రామాల్లోని రైతులు, ప్రజల జీవనోపాధిని తీవ్రంగా ప్రభావితం చేస్తాయని, తరతరాలుగా అక్కడి భూమిపై ఆధారపడిన మూడు లక్షల మందికి పైగా ప్రజల మనుగడ ప్రమాదంలో పడుతుందని కేంద్ర మంత్రికి వివరించారు. క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితిని పరిగణనలోకి తీసుకోకుండా సుప్రీం కోర్టు ఆదేశాలను అధికారులు అమలు చేయడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కొల్లేరు అభయారణ్య ప్రాంతం నుంచి 14,861 ఎకరాల ప్రైవేట్ భూములు, 7,102 ఎకరాల అసైన్డ్ భూములకు సరిహద్దులు పునరుద్ధరించాలని సిఫారసు చేస్తూ నేషనల్ బోర్డ్ ఫర్ వైల్డ్ లైఫ్ (ఎన్‌బీ డబ్ల్యుఎల్) మంజూరు చేసిన వెసులుబాటును అమలు చేసే వీలు కల్పించాలని ఎంపీ మహేష్ కుమార్ వినతి పత్రంలో పేర్కొన్నారు. భూముల వాస్తవ స్థితి, బాధిత ప్రజల న్యాయ మైన క్లెయిమ్‌లను పరిగణనలోకి తీసుకోవ డానికి సుప్రీంకోర్టుకు సవరించిన అఫిడవిట్‌ను దాఖలు చేయడానికి వీలుగా ఫిబ్రవరి నెలాఖరు వరకు కొల్లేరు ధ్వంసం ప్రక్రియపై స్టే కోరాలని విన్నవించారు. కాగా, తన విజ్ఞప్తిపై కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించారని ఎంపీ పుట్టా మహేష్ తెలిపారు.

కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి రాజశేఖర్‌ను గెలిపిద్దాం : బడేటి చంటి

ఏలూరుటూటౌన్, ఫిబ్రవరి7 (ఆంధ్రజ్యోతి) : పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపిద్దామని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. శుక్రవారం 28వ డివిజన్‌లో కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఆయన సమావేశం అయ్యారు. టీడీపీ కార్యకర్తలు, కూటమి పార్టీలోని నాయకులంతా ఇంటింటికి తిరిగి ఎమ్మెల్సీ అభ్యర్థి రాజశేఖర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరాలన్నారు.


నగదు అందిస్తున్న ఎమ్మెల్యే బడేటి చంటి

ఆపరేషన్‌కు ఆర్థిక సాయం

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం సయ్యద్‌మున్నీ అనే మహిళ తన భర్త ఆపరేషన్‌కు రూ.2లక్షల 70వేలు ఖర్చవుతుందని సాయం కావాలని ఎమ్మెల్యేను ఆశ్రయించింది. స్పందించిన ఆయన శుభం జ్యూయలర్స్ అధినేత రాజారావు దగ్గరకు ఆమెను తీసుకెళ్లి రూ.20వేలు, మరో వ్యాపారవేత్త నరసింహారావు రూ.5వేలు ఆర్థిక సాయం అందించారు. మరో రూ.లక్ష డ్వాక్రా గ్రూపుల ద్వారా సాయం అందిస్తామని హామీ ఇచ్చారు.

మాలల భవనానికి రూ.40 లక్షలు

మాలల సంక్షేమ భవన నిర్మాణానికి ఎంపీ గ్రాంట్ నుంచి రూ.40లక్షలు మంజూరు చేస్తామని ఎమ్మెల్యే బడేటి చంటి హామీ ఇచ్చారు మాలల ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి ఆంజ నేయులుతో పాటు కొంతమంది మాలల నాయకులు ఎమ్మెల్యేను కలిశారు. తక్షణ సాయంగా రూ.లక్ష నగదును అందజేశారు. మిగిలినవి ఎంపీ గ్రాంట్ నుంచి మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. మెండెం ఆనంద్, లంకపల్లి మాణిక్యాలరావు, కె.రవి, దిలీప్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులతో గ్రామాభివృద్ధి : ప్రభాకర్

పెదవేగి, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి) : గ్రామాల అభివృద్ధికి ఉపాధిహామీ పథకంలో కూలీల పాత్ర ఎంతో ఉందని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. ముందూరు పాతచెరువులో జరుగుతున్న ఉపాధి హామీ పనులను శుక్రవారం ఉదయం పరిశీలించిన ఆయన పలుగు పట్టి కూలీలతో కలిసి పనులు చేశారు. ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పనులను గ్రామాల అభివృద్ధి పనులకు జోడించడంతో పలు అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. అర్హత కలిగి, పని కోరి వచ్చే ప్రతి ఒక్కరికీ జాబ్‌కార్డు అందించి పని కల్పించాల్సిన బాధ్యత ఉపాధి హామీ ఉద్యోగులు, సిబ్బందిపై ఉందని, ఈ విషయంలో ఎవరైనా ఫిర్యాదులు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. పార్టీ నాయకులు ఈడ్పుగంటి అనిల్‌కుమార్, చిలకలపూడి నాగేశ్వరరావు, గారపాటి వెంకటేశ్వరరావు, అన్నపనేని సురేష్, కాంతయ్య, షేక్ ఉర్ధండు, నెక్కలపూడి సురేష్‌బాబు పాల్గొన్నారు.


కూలీలతో కలిసి పని చేస్తున్న ఎమ్మెల్యే ప్రభాకర్

రూ.9.35 కోట్ల గ్రంథాలయ సెస్ చెల్లించండి

ఏలూరుటూటౌన్, ఫిబ్రవరి7 (ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ గ్రంథాలయ సంస్థకు చెల్లించాల్సిన 9.35 కోట్ల రూపాయల సెస్‌ను తక్షణమే చెల్లించాలని గ్రంథాలయ సంస్థ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి.రాంబాబు, సహాయ కార్యదర్శి ఎండీ జుల్ఫికర్ అలీ కోరారు. శుక్రవారం నగరపాలక సంస్థ కమిషనర్ భాను ప్రతాప్‌ను కలిసి వారు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగరపాలక సంస్థ ఇప్పటి వరకు 9.35 కోట్లు సెస్ బకాయిలు చెల్లించాలని, కమిషనర్ ఈ నెలలో రూ.20 లక్షలు సెస్ చెల్లించినట్లు తెలిపారన్నారు. వచ్చే నెలలో మరో రూ.20 లక్షలు చెల్లిస్తామని మిగతా బకాయిలు విడతల వారీగా చెల్లిస్తామని కమిషనర్ హామీ ఇచ్చినట్లు తెలిపారు. జేసీ ధాత్రిరెడ్డిని కలిసి జిల్లాలో గ్రంథాలయ సెస్ బకాయిలు చెల్లించాలని ఆదేశాలు జారీ చేయాలని వినతిపత్రం సమర్పించామన్నారు.

ముందూరులో శ్మశాన భూమికి రక్షణ కల్పించాలి

పెదవేగి, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి) : ముందూరులో దళితులకు సంబంధించిన శ్మశానవాటికకు రక్షణ కల్పించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మికసంఘం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ముందూరులో ఆక్రమణకు గురైన దళితుల శ్మశానవాటిక స్థలాన్ని వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సంఘ జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ, రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ దళితులు అనే ఏళ్లుగా ఉపయోగించుకుంటున్న శ్మశానవాటిక భూమిని పలువురు అన్యాక్రాంతంచేసి ఆక్రమించుకున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. భూమి ఆక్రమణ చేసినవారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బట్టు మోషే, కొర్రపాటి విజయ్, గెడ్డం గంగరాజు, రాజారావు, జాలాది శ్రీను తదితరులు పాల్గొన్నారు.

క్రైం వార్తలు

మహిళపై దాడి.. ఇద్దరిపై కేసు

ఏలూరు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : ఓ మహిళపై ఇద్దరు వ్యక్తులు దాడి చేశారని సదరు మహిళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని హెచ్‌సీ ఎన్. ఉమామహేశ్వరరావు శుక్రవారం తెలిపారు. వివరాలివి.. జంగారెడ్డిగూడెం పట్టణానికి చెందిన షేక్ షబీనా స్థానిక రాజుల కాలనీలో నివాసం ఉంటూ ఏలూరు రోడ్డులో బ్యూటీ పార్లర్ నిర్వహిస్తున్నారు. కేదాసు వీరాంజనేయులు అనే వ్యక్తితో ఆమెకు పరిచయం ఏర్పడింది. అతడి వద్ద ఆమె రూ.60 వేల నగదు తీసుకుని తిరిగి ఇచ్చేశారు. అప్పటి నుంచి ఆమెతో అసభ్యంగా మాట్లాడుతూ వేధిస్తున్నాడని, ఈనెల ఒకటో తేదీన బ్యూటీపార్లర్ అద్దాలు పగులగొట్టి సామగ్రిని ఆటోలో వేసుకుని వెళ్లిపోతుండగా అడ్డుపడిన ఆమెపై దాడి చేశాడు. ఈ ఘటనపై శుక్రవారం ఆమె ఫిర్యాదు మేరకు వీరాంజనేయులుతో పాటు మరో వ్యక్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని హెచ్‌సీ తెలిపారు.

టీచర్‌ను బెదిరించిన వ్యక్తిపై కేసు

ఏలూరు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయురాలి వెంట పడి వేధించడమే కాకుండా అక్రమంగా ఇంట్లోకి ప్రవేశించి గొడవ పడి చంపుతామని బెదిరించిన వ్యక్తిపై ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ ఎస్‌కె.జబీర్ తెలిపారు. జంగారెడ్డిగూడెం పట్టణానికి చెందిన ఓ టీచర్ తాళ్ళపూడి మండలంలో ఓ హైస్కూల్‌లో ఆమె పని చేస్తున్నారు. గత కొంతకాలంగా నల్లజర్ల మండలం పోతవరం గ్రామానికి చెందిన కండవల్లి రాజేష్ అనే వ్యక్తి ఆమెను వేధిస్తున్నాడు. గత ఏడాది అక్టోబరులో ఆమె ఇంటి చుట్టూ కారుతో తిరిగాడని, ఎన్నిసార్లు వారించినప్పటికీ వినడం లేదని చంపుతానని కూడా బెదిరిస్తున్నాడని శుక్రవారం ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

సారా తరలిస్తున్న వ్యక్తిపై కేసు

చింతలపూడి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : చింతలపూడి ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో శుక్రవారం ఫాతిమాపురం సెంటర్‌లో తనిఖీలు చేస్తుండగా మోటారు సైకిల్‌పై సారా తరలిస్తున్న భూక్యా గోపి అనే వ్యక్తిని పట్టుకుని కేసు నమోదు చేశామని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పి.అశోక్ తెలిపారు. నాగిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన పలువురికి సారా తయారీ, అమ్మకాలు చేపట్టవద్దని గతంలో చెప్పామని, ఇకపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

వాహన తనిఖీల్లో 35 కేసులు

పెదపాడు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : కలపర్రు జాతీయ రహదారిపై రామచంద్ర ఇంజనీరింగ్ కాలేజీ వద్ద శుక్రవారం నిర్వహించిన వాహన తనిఖీల్లో 35 కేసులు నమోదు చేశామని వెహికల్ మోటారు ఇన్‌స్పెక్టర్ బిశేఖర్ తెలిపారు. మొత్తం 130 వాహనాలను తనిఖీ చేయగా వాటిల్లో ఐదు వాహనాలకు సంబంధించి ధ్రువీకరణ పత్రాలు లేని ఐదు వాహనాలను సీజ్ చేశామన్నారు. హెల్మెట్ ధరించని, ట్రాఫిక్ నిబంధనలు పాటించని వాహనదారులను, ఇంజనీరింగ్ విద్యార్థులను గుర్తించి వారికి ట్రాఫిక్ నియ మాలపై కౌన్సెలింగ్ నిర్వహించారు. తనిఖీల్లో అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు ఎండీ జమీర్ కళ్యాణి, నెహ్రూ, నరేంద్రబాబు, ప్రజ్ఞ పాల్గొన్నారు.

చెరువులపై పర్యవేక్షణ ఏది ?

» చేపట్టని కనీస మరమ్మతులు.. తూములు, చెరువు కట్టలు ధ్వంసం

» గుర్రపు డెక్కతో నిండిన వైనం



తుమ్మచెట్లతో నిండిన చెరువుగట్టు

లింగపాలెం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): లింగపాలెం మండలంలో గత ఐదేళ్ల వైసీపీ పాలనలో చెరువులపై పర్యవేక్షణ లేకపోవడంతో పాటు కనీసం మరమ్మతులు కూడా చేపట్టకపోవడంతో చెరువు తూములు, చెరువు కట్టలు ధ్వంసమయ్యాయి. పంట కాల్వలన్నీ ఆక్రమణలకు గురయ్యాయి. చెరువులన్నీ గుర్రపుడెక్క, చెత్తాచెదారంతో నిండిపోయాయి. చెరువులను పట్టించుకోకపోవడంతో చెరువుగట్లపై తుమ్మచెట్లు పెరిగి మనుషులే కాదు కనీసం పశువులుకూడా వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. గత ప్రభుత్వ హయాంలో చెరువుల మరమ్మతులకు నిధులు మంజూరు చేయకపోవడంతో పరిస్థితి దారుణంగా తయారైంది. తూముల ముఖద్వారాలన్నీ గుర్రపుడెక్క, చెత్తాచెదారంతో నిండి తూములన్నీ విరిగిపోవడంతో చెరువులో నీరంతా వృధాగా పోతుంది. చెరువుగట్లపై తుమ్మచెట్లు దట్టంగా పెరిగాయి. తూములు శిథిలం కావడంతో రైతులు చెరువులో నీటిని కాపాడుకునేందుకు ఇసుక నింపిన సంచులతో తూములను మూసి తమ పంటలకు నీరు అవసరమైనప్పుడు సంచులు తొలగించి నీటిని వాడుకుంటున్నారు. ఇప్పటికైనా చెరువుల మరమ్మతులకు నిధులు కేటాయించి వర్షాకాలం రాకముందే చెరువుల తూములు, కాల్వల మరమ్మతులు చేపట్టాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

త్వరలో చెరువుల్లో మరమ్మతులు చేస్తాం

గతప్రభుత్వ హయాంలో చెరువులను పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వ పాలనలో పంట కాల్వలను రైతుల సహకారంతో బాగు చేసుకుంటున్నాం. మండలంలో చెరువుల దుస్థితిని ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ దృష్టికి తీసుకువెళ్లగా మరమ్మతులకు నిధులు మంజూరయ్యేలా చర్యలు తీసుకున్నారు. త్వరలోనే చెరువుల మరమ్మతుల పనులు జరిగేలా చూస్తాం.



\- మోరంపూడి వరప్రసాద్, సాగునీటి సంఘం అధ్యక్షుడు, ధర్మాజీగూడెం


నిర్వాసితులతో మాట్లాడుతున్న ఆర్డీవో రమణ

నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి కృషి : ఆర్డీవో

జీలుగుమిల్లి, జనవరి, 7 : (ఆంధ్రజ్యోతి) : నిర్వాసితుల సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని జంగారెడ్డిగూడెం ఆర్డీవో ఎంవి.రమణ అన్నారు. అంకన్నగూడెం, రాచన్నగూడెం శివారు నిర్వాసితుల గ్రామాలైన తెల్లవరం, శివగిరి గ్రామాల్ని ఆమె శుక్రవారం పరిశీలించారు. నిర్వాసితులు తమకు పీఎం సూర్యఘర్ పథకం అమలు చేయాలని, కొందరు భూములకు పట్టాలు ఇవ్వలేదని, ఇళ్లవద్ద విద్యుత్తు కనెక్షన్లు ఏర్పాటు చేయలేదని తెలిపారు. వారి సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని, ఉన్నతాధికారులకు నివేదిక పంపుతామన్నారు. ఇన్‌చార్జి తహసీల్దారు ఉదయ్ భాస్కర్, హౌసింగ్ ఏఈ ప్రసాద్ ఉన్నారు.

స్పీకర్ అయ్యన్నపాత్రుడు రాజీనామా చేయాలి

బుట్టాయగూడెం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): 1/70 చట్టంపై స్పీకర్ అయ్యన్నపాత్రుడు వ్యాఖ్యలు తగవని, తక్షణమే పదవికి రాజీనామా చేయాలని ఆదివాసీ సంఘాలు నాయకులు మండిపడ్డారు. శుక్రవారం బుట్టాయగూడెంలో ఆదివాసీ సంఘాల ముఖ్యనాయకుల సమావేశంలో ఏఎస్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు కాకి మధు మాట్లాడారు. అతనిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టి అరెస్టు చేయాలన్నారు. ఎస్టీలు కోట్ల రూపాయలు పెట్టుబడులు పెట్టలేరని, 1/70 చట్టం సవరణకు ఉన్న అవకాశాలను అధ్యయనం చేయాలని కలెక్టర్లకు సూచిస్తూ ఆదివాసీల పట్ల అవహేళనగా మాట్లాడిన స్పీకర్ ఆదివాసీ సమాజానికి క్షమాపణ చెప్పాలన్నారు. ఈనెల 12న జరిగే రాష్ట్ర మన్యం బంద్‌ను విజయవంతం చేయాలని కోరారు. కుంజా శ్రీను, జేఏసీ చైర్మన్ మొడియం శ్రీనివాసరావు, సోడెం ముక్కయ్య, ఎస్.రామ్మోహన్, జి.అప్పన్న, కె.వెంకటేశ్వరావు, కె.కృష్ణంరాజు, టి.లక్ష్మణరావు ఏజెన్సీ మండలాల నాయకులు పాల్గొన్నారు.

శివరాత్రి పోస్టర్ల ఆవిష్కరణ

టి.నరసాపురం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : శ్రీ అన్నపూర్ణ విశాలాక్షి సమేత కాశీ విశ్వేశ్వరస్వామి దివ్యక్షేత్ర ప్రాంగణంలో శివరాత్రి కల్యాణ మహోత్సవ పోస్టర్లను ఆలయ కమిటీ చైర్మన్ రమేష్ రాజు ఆధ్వర్యంలో తహసీల్దార్ సాయిబాబా, ఎస్ఐ జయబాబు, విద్యుత్‌శాఖ ఏఈ శ్రీనివాస్ శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శివ భక్తులు పసుమర్తి రాము మాట్లాడుతూ ఈ సంవత్సరం శివరాత్రి కల్యాణ మహోత్సవ కార్యక్రమాలు ఫిబ్రవరి 24వ తేదీ నుంచి 28వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ మోదుగు సునంద, పర్వతనేని మురళీ, శ్రీను రాజు, దేవరపల్లి ముత్తయ్య, అద్దంకి మహేశ్వరరావు, ఘంటా సతీష్, పెద్దిన సత్యనారాయణ, పేరం రాంబాబు, కాసనేని వెంకట్రావు, తదితరులు పాల్గొన్నారు.

నామినేటెడ్ పోస్టుల్లో బీసీ రిజర్వేషన్‌పై హర్షం

ద్వారకాతిరుమల, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): నామినేటెడ్ పోస్టుల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ కేబినెట్ సమావేశంలో చంద్రబాబు నిర్ణయం తీసుకోవడం హర్షనీయమని టీడీపీ బీసీ సెల్ స్టేట్ సెక్రటరీ కూరాకుల బుజ్జియాదవ్ అన్నారు. తెలుగుదేశం పార్టీ స్థాపించిన నాటి నుంచి బీసీలకు అధికప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. టీడీపీ అంటే బీసీల పార్టీగా గుర్తింపు పొందిందన్నారు. అధినేత తీసుకున్న నిర్ణయానికి బీసీ సంఘాల తరఫున కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు.


కూరాకుల బుజ్జి

'వెట్టిచాకిరీ నిర్మూలనకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి'

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో వెట్టి చాకిరీ వ్యవస్థ నిర్మూలనకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ అన్నారు. వెట్టిచాకిరి వ్యవస్థ నిర్మూలన దినోత్సవం పురస్కరించుకుని శుక్రవారం ఏలూరు జిల్లా కోర్టు ఆవరణలో గ్రామ మహిళా సంరక్షణా కార్యదర్శులకు, ఇతర ప్రభుత్వశాఖల వారికి అవగాహన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వెట్టి చాకిరీ చేసే వారి వివరాలు సేకరించాలన్నారు. ఆ పని నుంచి వారికి విముక్తి కల్పించాలని, అవసరమైతే వారి స్వగ్రామాలకు పంపించే కార్యాచరణ చేపట్టాలన్నారు. అనంతరం ఉప కార్మిక కమిషనర్ పి.శ్రీనివాస్ మాట్లాడారు. ఏలూరు మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎం.సుబ్బారావు, ఎస్ఐ వి.కాంతిప్రియ, ఐసీడీఎస్ పీడీ శారద, సమగ్ర శిక్ష ఏపీసీ పంకజ్‌కుమార్, డీసీపీవో సూర్య చక్రవేణి, అధికారులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న రత్నప్రసాద్

• ఏలూరు : బాల బాలికలతో వెట్టిచాకిరి చేయించే వారు చట్టపరమైన శిక్షలకు గురవుతారని జంగారెడ్డిగూడెం జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కె.రాజేశ్వరి తేజస్విని అన్నారు. శుక్రవారం స్థానిక కోర్టు ఆవరణలో న్యాయవాదులకు, పారాలీగల్ వలంటీర్లకు వెట్టిచాకిరీ నిషేధంపై అవగాహన కార్యక్రమం న్యాయవాది అచ్యుత శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగింది.


సమావేశంలో మాట్లాడుతున్న పాస్టర్ జ్యోతిరాజు

ప్రతి ఒక్కరూ రక్షణ పొందాలి : డాక్టర్ పాల్ దినకరన్

ఏలూరుటూటౌన్, ఫిబ్రవరి7 (ఆంధ్రజ్యోతి): ప్రభువైన ఏసుక్రీస్తు నిజమైన దేవుడని తెలుసుకుని తమ పాపాలు ఒప్పుకుని ప్రతి ఒక్కరూ రక్షణ పొందాలని అంతర్జాతీయ సువార్తీకులు డాక్టర్ పాల్ దినకరన్ అన్నారు. ఏలూరు ఇండోర్ స్టేడియంలో మన్నాచర్చి ఆధ్వర్యంలో ఏసు పిలుచుచున్నాడు ప్రార్థన పండుగలు బిషప్ ఎం.ఎలిషారావు అధ్యక్షతన శుక్రవారం ప్రారంభమయ్యాయి. మన్నాచర్చి అధ్యక్షుడు బిషప్ స్వర్జన్‌రాజు, ఏలూరు కథోలిక పీఠాధిపతులు రెవరెండ్ బిషప్ జయరావు పొలిమేర మాట్లాడుతూ ప్రార్థన పండుగల్లో పాల్గొన్న వారందరికి దేవుని దీవెనలు మెండుగా ఉండాలన్నారు. మన్నా చర్చి సీనియర్ పాస్టర్ ఎం.జ్యోతిరాజు, సిస్టర్ సునీత, సిస్టర్ యువాంజలిన్‌పాల్ దినకరణ్, బిషప్ పేతురు, బిషప్ తిమోతిబాబు, బ్రదర్ శామ్యూల్ దినకరణ్, బ్రదర్ డేవిడ్ డేనియల్‌సన్, దేవుని సందేశం అందించారు. మన్నాచర్చి వర్షిప్ టీమ్‌చే మధుర సంగీతం, పాటలు, స్తుతి ఆరాధనతో అలరించారు. జిల్లా నలుమూలల నుంచి వేలాదిగా విశ్వాసులు పాల్గొన్నారు.

పోలవరంలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమం

ఏలూరు, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి) : పోలవరం మండలంలో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. మండల కేంద్రంలో బెస్తావీధి ఇతర ప్రాంతాలలో డ్రైడే కార్యక్రమంలో భాగంగా నివాస ప్రాంతాలలో నిల్వ ఉన్న నీటి తొట్టెలను, ట్యాంకులను ఖాళీ చేయించారు. వీధుల్లోని మురికి గుంటలలో దోమల లార్వా నివారణ కోసం మందులు చల్లారు. ఈ సందర్భంగా స్థానిక గృహిణులకు దోమల వల్ల వచ్చే రోగాలు నివారణ పట్ల అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది నాగలక్ష్మి, పోశమ్మ, ఆశ వర్కర్లు బీరా రత్నాజీ, గోకా అరుణ, కుబ్ర తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

నేటి నుంచి రామకోటి ఉత్సవాలు

ఏలూరుకార్పొరేషన్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : స్థానిక అగ్రహారంలోని రామకోటి ప్రాంగణంలో ఈనెల 8 నుంచి మార్చి రెండో తేదీ వరకు 93వ రామకోటి మహోత్సవాలు జరుగుతాయని ఉత్సవ కమిటీ అధ్యక్షుడు గాదంశెట్టి రమేష్‌కుమార్, కార్యదర్శి మానేపల్లి రామారావు తెలిపారు. శుక్రవారం రామకోటి ప్రాంగణంలో సంబంధిత బ్రోచర్లను కార్యవర్గ సభ్యులు ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ ప్రతి రోజు ఉదయం, సాయంత్రం వేళల్లో పూజలు, రాత్రి వేళల్లో సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ఈనెల 24వ తేదీ మాఘ బహుళ ఏకాదశి సందర్భంగా భక్తులచే సామూహికంగా రమా సహిత సత్యనారాయణస్వామి వ్రతాలు జరుపుతామన్నారు. 26న మహా శివరాత్రి సందర్భంగా పార్థివ లింగాన్ని ఏర్పాటు చేసి అభిషేకాలు, రుద్రాభిషేకాలు నిర్వహిస్తామనానరు. రెండో తేదీన అన్నసమారాధనతో ఉత్సవాలు ముగుస్తాయన్నారు.

ముగిసిన రథ సప్తమి ఉత్సవాలు

ఏలూరుకార్పొరేషన్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : స్థానిక పవరుపేట స్టేషన్ రోడ్డులోని ధన్వంతరి వైద్య భగవానుని ఆలయం వద్ద జరుగుతున్న రథసప్తమి ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. ముగింపు సందర్భంగా ఆలయ ప్రాంగణంలో స్వామివారికి, అమ్మవార్లకు పవళింపు సేవా కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా అర్చకులు రాళ్ళబండి ఆదినారాయణస్వామి, వేద పండితులు సంయుక్తంగా నిర్వహించారు. తొలుత స్వామి, అమ్మవార్లకు అభిషేకాలు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ కోరాడ రెడ్డి, ఈవో నెహ్రూలు భక్తులకు ఏర్పాట్లు చేశారు. ఉత్సవ కమిటీ కార్యవర్గ సభ్యులు తోట రమేష్‌కుమార్, యర్రంశెట్టి గంగాధరరావు, భారతి శ్రీనివాసరావు, ఘంటా రాంబాబు, నర్రా లక్ష్మణ, మట్టా జగదీష్ తదితరులు భక్తులకు సేవలు అందించారు. ఈనెల 16న ఆలయ ప్రాంగణంలో భక్తులకు మహా అన్నసమారాధనను ఏర్పాటు చేసినట్టు తెలియచేశారు.

సాయిబాబా మందిర వార్షికోత్సవం

పెదవేగి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : బాపిరాజుగూడెంలోని శ్రీషిర్డీ సాయిబాబా ఆలయ వార్షికోత్స వేడుకలు మూడు రోజులుగా ఘనంగా నిర్వహించారు. చివరిరోజు శుక్రవారం ఆలయంలో ప్రత్యేక హోమం నిర్వహించారు. సాయిబాబాకు 108 రకాల మిఠాయిలు, పండ్లతో నైవేద్యం సమర్పించి, పూజలు చేశారు. మూడు వేల మందికి పైగా భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు. కొల్లి సత్యవతి, కృష్ణమోహన్ దంపతుల ఆధ్వర్యంలో ఆలయ కమిటీ సభ్యులు బొప్పన సుధాకర్, ప్రసాద్, గంధమనేని సత్యనారాయణ, రావిపాటి రామదాసు, తదితరులు పాల్గొన్నారు.


విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే మద్దిపాటి

ముత్యాలమ్మ విగ్రహ ప్రతిష్ఠ

ద్వారకాతిరుమల, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): పంగిడిగూడెంలో గ్రామస్థుల సహకారంతో నిర్మించిన ముత్యాలమ్మ విగ్రహ ప్రతిష్ఠ శుక్రవారం వైభవంగా జరిగింది. కార్యమంలో గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు పాల్గొని పూజలు నిర్వహించారు. పండితులు, పురోహితుల వేదమంత్రోచ్ఛరణల నడుమ ఘనంగా నిర్వహించారు. పూజల అనంతరం ఎమ్మెల్యే మద్దిపాటి పండితుల నుంచి వేదాశీస్సులు పొందారు. ఆలయ ప్రాంగణంలో భారీ అన్నసమారాధన జరిగింది. టీడీపీ నేతలు లంకా సత్యనారాయణ, చింతమనేని హనుమంతరావు, నాయకులు పాల్గొన్నారు.

ఇంటర్ ఒకేషనల్ ప్రాక్టికల్స్‌కు 272 మంది గైర్హాజరు

ఏలూరు అర్బన్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియట్ ఒకేషనల్ విద్యార్థులకు జరుగుతున్న ప్రాక్టికల్స్ పరీక్షల్లో భాగంగా శుక్రవారం ఉదయం పూట పరీక్షకు 1,011 మంది విద్యార్థులకు కేటాయించగా 810 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం పూట 729 మందికి 658 మంది హాజరయ్యారని ఆర్‌ఐవో కె.యోహాన్ తెలిపారు.

రైతులు బిల్లులు తీసుకోవాలి

చింతలపూడి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : ఎరువులు, పురుగుమందులు, విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు రైతులు, వినియోగదారులు తప్పనిసరిగా బిల్లులు తీసుకోవాలని ఏవో కె.మీనాకుమారి తెలిపారు. శుక్రవారం మండలంలోని పలు ఎరువులు, పురుగు మందుల దుకాణాలను ఆమె తనిఖీ చేశారు. దుకాణదారులు ఎంఆర్‌పీ ధరలకే అమ్మాలని, బిల్లు ఇవ్వాలని సూచించారు. రైతులకు కావాల్సినవి నిర్ణీత సమయంలో స్టాక్‌లు సిద్ధంగా ఉంచుకోవాలని డీలర్లకు సూచనలు చేశారు. రాబోయే రబీ సీజన్‌కు మండలంలో విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో రైతులు శుద్ధి చేసిన విత్తనాలు తీసుకోవాలని సూచించారు.



ఆటోడ్రైవర్లతో మాట్లాడుతున్న రెడ్డిఅప్పలనాయుడు

ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరిస్తా

ఏలూరు రూరల్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ఏలూరు కొత్త బస్టాండు పరిధిలో ఉన్న ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరిస్తానని ఆర్టీసీ జోనల్ చైర్మన్ రెడ్డిఅప్పల నాయుడు అన్నారు. ఆటోస్టాండ్ యూనియన్ నాయకులు శుక్రవారం జనసేన పార్టీ కార్యాలయంలో భేటీ అయ్యారు. వారు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలంటూ విజ్ఞప్తి చేశారు. ఆయన స్పందిస్తూ ఆర్టీసీ అధికారులతో యూనియన్ ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలంటూ ఆదేశించారు. యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

10న ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయాలి

ఏలూరు రూరల్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా ఈనెల 10న ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీని విజయవంతం చేయాలని ఏలూరు ఎంపీడీవో వెన్నా శ్రీలత కోరారు. శుక్రవారం ఏలూరు మండలపరిషత్ కార్యాలయంలో మండల వైద్య అధికారులు, అంగన్‌వాడీలకు మాత్రలను అందజేశారు. ఆమె మాట్లాడుతూ మండలపరిధిలో ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల్లో కార్యక్రమం అమలయ్యే చూడాలని, నులిపురుగుల మాత్రలను ఉచితంగా పంపిణీ చేయాలని సూచించారు. గుడివాకలంక పీహెచ్‌సీ వైద్యులు ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

పత్తి, మిర్చి పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలి

ఏలూరు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : ఆరుగాలం కష్టపడి పత్తి, మిర్చి పండించిన రైతులకు గిట్టుబాటు ధర లేక నష్టపోతున్నారని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం జంగారెడ్డిగూడెం సీపీఎం కార్యాలయంలో ఏపీ రైతు సంఘం ముఖ్యనాయకుల సమావేశం సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు బొడ్డు రాంబాబు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్వింటా పత్తికి రూ.10 వేలు, మిర్చికి రూ.25 వేలు కనీస మద్దతు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. ఏపీ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.సీతారామయ్య, జంగారెడ్డిగూడెం మండల అధ్యక్షుడు బి.రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

బుట్టాయగూడెం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ఏపీ గిరిజన సంక్షేమ ఉపాధ్యాయ సంఘం క్యాలెండర్ 2025ను కేఆర్‌పురం ఐటీడీఏ పీవో, ఆర్అండ్‌ఆర్ ఆఫీసర్ కె.రాములు నాయక్ శుక్రవారం తన చాంబర్‌లో ఆవిష్కరించారు. గిరిజనుల అభివృద్ధికి, సమస్యల పరిష్కారంలో సంఘాలు తమవంతు సహకారం అందించాలని సూచించారు. నాయకులు మొడియం గంగరాజు, పాయం పోశియ్య, కె.వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు, పి.వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆకుకూరలు పండిస్తున్నాం

ఏలూరు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీస్కూల్ పిల్లలకు, గర్భిణులు, బాలింతలకు అవసరమైన ప్రొటీన్, విటమిన్లు కలిగిన ఆకు కూరలు, కాయగూరలను అంగన్‌వాడీ కేంద్రాల్లోనే ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించి అందజేస్తున్నామని ఐసీడీఎస్ సీడీపీవో పి.బ్యూలా తెలిపారు. శుక్రవారం జంగారెడ్డిగూడెం మండలం తిరుమలాపురం అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు ఆకుకూరలతో పాటు ప్రతీ నెలా అందచేసే రేషన్‌ను అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతీ అంగన్‌వాడీ కేంద్రంలో ఎరువులు, పురుగుమందులు వేయకుండా ఆకుకూరలు, కాయగూరలు పండిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ ప్రీస్కూల్ పిల్లలకు కుర్చీలు, వాటర్ ఫిల్టర్లు, జారుడు బల్లలు అందజేశారు. సూపర్‌వైజర్ ఎం.విజయలక్ష్మి, జీఎంఎస్‌కే అంగన్‌వాడీ టీచర్లు మేరీ, ఫాతీమా, అనూష, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

కొల్లేరు ప్రాంత ప్రజలకు న్యాయం చేయండి

» కేంద్ర మంత్రి భూపేంద్రకు ఎంపీ పుట్టా విజ్ఞప్తి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): ఇటీవల సుప్రీంకోర్టు జారీ చేసిన ఆదేశాలపై కేంద్ర ప్రభుత్వం తక్షణం జోక్యం చేసుకుని, కొల్లేరు ప్రాంత ప్రజలకు న్యాయం చేయాలని కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రి భూపేంద్ర యాదవ్‌కు టీడీపీ ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ఇందిరా పర్యావరణ భవన్‌లో కేంద్ర మంత్రిని ఎంపీ మహేష్ కలిసి వినతిపత్రం అందించారు. 2025 జనవరి 16న సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలతో కొల్లేరు సరస్సు ప్రాంతంలో దీర్ఘకాలికంగా నివసిస్తున్న ప్రజలు భయాందోళనకు గురవుతున్న విషయాన్ని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి కోర్టు జారీ చేసిన ఆదేశాలు 122 గ్రామాల్లోని రైతులు, ప్రజల జీవనోపాధిని తీవ్రంగా ప్రభావితం చేస్తాయని, తరతరాలుగా అక్కడి భూమిపై ఆధారపడిన మూడు లక్షల మందికి పైగా ప్రజల మనుగడ ప్రమాదంలో పడుతుందని ఎంపీ మహేష్ కుమార్ కేంద్ర మంత్రికి వివరించారు. క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితిని పరిగణనలోకి తీసుకోకుండా సుప్రీంకోర్టు ఆదేశాలను అధికారులు అమలు చేయడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కొల్లేరు అభయారణ్య ప్రాంతం నుంచి 14,861 ఎకరాల ప్రైవేట్ భూములు, 7,102 ఎకరాల అసైన్డ్ భూములకు సరిహద్దులు పునరుద్ధరించాలని సిఫారసు చేస్తూ నేషనల్ బోర్డ్ ఫర్ వైల్డ్ లైఫ్ (ఎన్‌బీడబ్ల్యుఎల్) మంజూరు చేసిన వెసులుబాటును అమలు చేసే వీలు కల్పించాలని ఎంపీ మహేష్ కుమార్ వినతిపత్రంలో పేర్కొన్నారు. భూముల వాస్తవ స్థితి, బాధిత ప్రజల న్యాయమైన క్లెయిమ్‌లను పరిగణనలోకి తీసుకోవడానికి సుప్రీంకోర్టుకు సవరించిన అఫిడవిట్‌ను దాఖలు చేయడానికి వీలుగా ఫిబ్రవరి నెలాఖరు వరకు కొల్లేరు ధ్వంసం ప్రక్రియపై స్టే కోరాలని విన్నవించారు. కాగా, తన విజ్ఞప్తిపై కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించారని ఎంపీ పుట్టా మహేష్ తెలిపారు.



రిటైర్డ్ డీవైఈవో వెంకటేశ్వరరావును సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించాలి

ముదినేపల్లి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించాలని గుడివాడ డివిజన్ రిటైర్డ్ డీవైఈవో గన్నమనేని వెంకటేశ్వరరావు తెలిపారు. పెదపాలపర్రు జడ్పీ హైస్కూలు వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా హెచ్ఎం పాండురంగారావు అధ్యక్షత వహించారు. హైస్కూలును దత్తత తీసుకుని అభివృద్ధికి సహకరిస్తున్న వెంకటేశ్వరరావును ఉపాధ్యాయులు, ఎస్ఎంసీ చైర్మన్ నరసింహమూర్తి ఘనంగా సత్కరించారు. పాఠశాలకు రూ.10 వేలు విరాళం అందజేసిన గురజ హైస్కూలు తెలుగు పండిట్ ఈడే వెంకటేశ్వరరావును సన్మానించారు.



ఎమ్మెల్సీ నామినేషన్ కార్యక్రమానికి కూటమి నేతలతో తరలివెళుతున్న ఎమ్మెల్యే కామినేని

ఎమ్మెల్సీ నామినేషన్‌కు తరలిన కూటమి నేతలు

కైకలూరు, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నామినేషన్‌కు కైకలూరు నియోజకవర్గం నుంచి కూటమి నేతలు తరలివెళ్లారు. శుక్రవారం కైకలూరు సీఎన్నార్‌గార్డెన్ నుంచి ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ ఆధ్వర్యంలో వందలాది కార్లలో కూటమి నేతలు భారీగా వెళ్లి గుంటూరు కలెక్టరేట్‌లో నామినేషన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కామినేని మాట్లాడుతూ పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థిగా ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ పోటీ చేస్తున్నారని, కూటమి నేతలంతా కష్టపడి పనిచేసి అఖండ మెజార్టీతో గెలిపించేందుకు కృషి చేయాలన్నారు.

ఇదేనా రక్షణ.. ?



ఎండలు పెరుగుతున్నాయని చెప్పేందుకు.. నిబంధనలు మీరి రవాణా వాహనంలో మహిళలను తీసుకుని వెళుతున్నందుకు ఈ చిత్రమే నిదర్శనం. ఓ శుభ కార్యక్రమం నిమిత్తం మహిళలను పెద్ద సంఖ్యలో ఈ టాటా ఏస్ వాహనంలో వుంచి తీసుకుని వెళుతున్నారు. ఇందులో కొందరు కూర్చోగా, మరికొందరు నిలుచుని ఉన్నారు. ఓ వైపు రహదారి భద్రతా మాసోత్సవాలు జరుపుకుంటూనే ఇలా తీసుకువెళ్లినా అధికారులకు కనిపించడం లేదు. మరోవైపు ఎండల నుంచి రక్షణ కోసం వీరు వాహనం పైన కొబ్బరి మట్టలతో కట్టి రోడ్డుపై పరుగులు పెట్టిస్తున్నారు. ఏలూరు జిల్లా నూజివీడు గాంధీ బొమ్మల సెంటర్‌లో కనిపించిన దృశ్యమిది.



చాట్రాయిలో పోస్టర్ విడుదల ఆవిష్కరిస్తున్న అధికారులు

జాతీయ నులి పురుగుల నివారణ పోస్టర్ ఆవిష్కరణ

చాట్రాయి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమం పోస్టర్‌ను శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో అధికారులు ఆవిష్కరించారు. ఈనెల 10న మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలలో 1 నుంచి 19 సంవత్సరాల పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రం మింగించటం జరుగుందని, ఈ మాత్రలు తీసుకోవటం వల్ల నులిపురుగులు కారణంగా ఏర్పడే రక్తహీనత నివారణ అవుతుందన్నారు.ఎంపీడీవో విజయలక్ష్మి, వైద్యాధికారి శ్రీనివాసులరెడ్డి, ఎంఈవో బ్రహ్మాచారి, సీహెచ్‌వో రమణ, ఈవోపీఆర్డీ నాగరాజు, హెచ్ఎం కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.



కార్మికులనుద్దేశించి మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి పెదకాశీం

కార్మికులకు న్యాయ విజ్ఞాన సదస్సు

నూజివీడు టౌన్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): నిర్బంధ కార్మికులుగా పనిచేయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని నూజివీడు సీనియర్ సివిల్ జడ్జి పెదకాశీం హెచ్చరించారు. శుక్రవారం నూజివీడులో ఇటుక బట్టీలు, ఫ్లయాష్ పరిశ్రమ కార్మికులకు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. నిర్బంధ కార్మిక వ్యతిరేక దినోత్సవం పురస్కరించుకుని నిర్వహించిన ఈ న్యాయ విజ్ఞాన సదస్సులో న్యాయవాది మాటూరి రవికాంత్, పారా లీగల్ వలంటీర్లు పాల్గొన్నారు.

రెయిలింగ్ ఊడిపోయి ప్రమాదకరంగా వంతెన



కలిదిండి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలో సంతోషపురం ప్రధాన కాల్వపై ఉన్న వంతెన శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా ఉంది. 36 ఏళ్ల క్రితం ఈ వంతెన నిర్మించారు. ఇంత వరకు మరమ్మతులు చేపట్టిన దాఖలాలు లేవు. వంతెన ఇరువైపులా రెయిలింగ్ పూర్తిగా విరిగి ఊడిపోయింది. దీంతో వాహనాలు అదుపు తప్పి కాల్వలో బోల్తా పడటంతో వాహనదారులు గాయాలపాలవుతున్నారు. ఎదురెదురుగా వస్తున్న వాహనాలు పక్కకు తప్పుకోవడానికి వీలు లేక గంటల తరబడి ట్రాఫిక్ స్తంభిస్తోంది. ఈ వంతెన పక్కనే దుర్గమ్మ ఆలయం ఉండటంతో రద్దీగా ఉంటుంది. భక్తులు ఈ వంతెనపై నుంచి అమ్మవారి ఆలయానికి వెళ్లి వస్తుంటారు. ఏ క్షణంలో ఏ ప్రమాదంలో జరుగుతుందోనని భయాందోళన చెందుతున్నారు. వంతెన శ్లాబ్ పెచ్చులూడి ఇనుప చువ్వలు బయట పడ్డాయి. వంతెన ఇరువైపులా ఉన్న గోడలు బీటలు వారాయి. రూ.7 కోట్లతో నూతనంగా నిర్మించిన బీటీ రోడ్డు ఈ వంతెనపై నుంచి వెళ్లడంతో వాహనాల రాకపోకలతో రద్దీగా ఉంటుంది. భారీ వాహనాలు వెళ్తున్నప్పుడు వంతెన ఊగిపోతోందని ఏ క్షణంలో కూలిపోతుందోనని ఆందోళన చెందుతున్నారు. వంతెనకు మరమ్మతులు చేపట్టాలని గత ఐదేళ్లుగా పాలకులకు అధికారులకు పలుమార్లు విన్నవించినప్పటికీ పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి శిథిలావస్థలో ఉన్న సంతోషపురం వంతెనకు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

నిషేధిత రసాయనిక పురుగు మందులు స్వాధీనం



నిషేధిత రసాయనిక పురుగుమందుల డబ్బాలు చూపుతున్న ఏడీఏ గంగాధరరావు

కైకలూరు, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): నిషేధిత రసాయనిక పురుగు మందులు విక్రయాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కైకలూరు వ్యవసాయశాఖ ఏడీఏ ఆర్.గంగాధరరావు హెచ్చరించారు. కైకలూరులోని ఏటుజెడ్ ఆక్వా రైతుబజారులో శుక్రవారం తనిఖీలు నిర్వహించగా నిషేధిత రసాయనిక పురుగు మందులను కనుగొన్నట్లు తెలిపారు. 864 నిషేధిత పురుగుమందు డబ్బాలను స్వాధీనం చేసుకున్నారు. ఏడీఏ మాట్లాడుతూ ఆక్వామందుల దుకాణంలో అనుమతులున్నా నిషేధిత, అత్యంత విషపూరిత రసాయనిక పురుగు మందులు విక్రయాలు జరుగుతున్నాయని వీటిని అమ్మకాలు చేయాలంటే మరో ప్రత్యేకమైన లైసెన్సు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. ఈ పురుగు మందులను వేర్‌హౌస్ గొడౌన్లలోను పెద్దపెద్ద షిప్పుల్లోనూ వినియోగిస్తారని ఇవి ఆక్వా రైతులకు విక్రయాలు చేయడం నేరమన్నారు. ఈ రసాయనిక మందులను వాసన పీల్చినా మనిషి అస్వస్థతకు గురవుతాడని ఎక్కువ మోతాదులో పీలిస్తే ప్రాణాపాయ స్థితిలోకి వెళతారని తెలిపారు. రెవెన్యూ అధికారుల సమక్షంలో పంచనామా నిర్వహించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో ఏవో ఆర్.దివ్య, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌లపై అవగాహన

కైకలూరు, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): విద్యార్థినులు అపరిచిత వ్యక్తుల పట్ల, సోషల్ మీడియాలో పరిచయమయ్యే వ్యక్తుల పట్ల జాగ్రత్తలు పాటించాలని కైకలూరు టౌన్ ఎస్సైలు ఆర్.శ్రీను, డి వెంకట్‌కుమార్ అన్నారు. శుక్రవారం ఆటపాక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థినీలకు గుడ్ టచ్, బ్యాడ్‌టచ్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆకతాయిల వేధింపులకు గురైతే తక్షణమే 112 నెంబర్‌కు ఫోన్ చేసి సమాచారమివ్వాలన్నారు.

రమాబాయి చిత్రపటానికి నివాళులు

మండవల్లి ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): మాతా రమాబాయి అంబేడ్కర్ త్యాగానికి, పోరాటానికి నిలువెత్తు రూపమని, ఆమె జీవితం నేటి తరానికి ఆదర్శమని పలువురు నాయకులు పేర్కొన్నారు. అంబేడ్కర్ సతీమణి రమాబాయి 128వ జయంతి సందర్భంగా మండవల్లి సెంటరులో శుక్రవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎల్ఎస్ భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.



ముసునూరులో తనిఖీ చేస్తున్న అధికారులు

విద్యుత్ సర్వీసుల తనిఖీ

ముసునూరు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ముసునూరు మండల వ్యాప్తంగా జిల్లా విద్యుత్ విజిలెన్స్ అధికారిణి పి.విజయ కుమారి ఆధ్వర్యంలో శుక్రువారం తనిఖీలు నిర్వహించారు. ట్రాన్స్‌కో డీఈఈలు, ఏఈలు, లైన్ ఇన్‌స్పెక్టర్లు 38 బృందాలుగా ఏర్పడి 2,817 విద్యుత్ సర్వీసులను తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో మీటరు లేకుండా ఉన్న 5 కనెక్షన్‌లు, ఒక కేటగిరిపై సర్వీసు తీసుకుని, మరో కేటగిరిలో విద్యుత్ వాడుతున్న 2 సర్వీసులు, అదనపు లోడ్ ఉన్నట్లు 162 సర్వీసులను గుర్తించినట్లు విజయకుమారి తెలిపారు. వీటికి మొత్తం రూ.5లక్షల 20 వేలు అపరాధ రుసుం విధించినట్లు తెలిపారు. నూజివీడు డివిజనల్ విద్యుత్ అధికారి ఏ.సత్యనారయణ తదితరులు పాల్గొన్నారు.



చాట్రాయిలో సర్వే నిర్వహిస్తున్న అధికారులు

చిన్న వ్యాపారులను ప్రోత్సహించేందుకు సర్వే

చాట్రాయి, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): చిన్న వ్యాపారులను ప్రోత్సహించి వారికి మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించటానికి ప్రభుత్వం ఎంఎస్ ఎంఈ సర్వే నిర్వహిస్తున్నదని నూజివీడు డివిజనల్ అభివృద్ధి అధికారి వెంకటరత్నం అన్నారు. శుక్రవారం చాట్రాయిలో జరుగుతున్న ఫీల్డ్ సర్వేని ఆయన పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. సర్వే సిబ్బంది ప్రతిషాపుకు వెళ్ళి, రోజువారి అమ్మకం, ఆదాయం, షాపు సొంతమా లేక అద్దె భవనంలో నడుపుతున్నారా? ఆధార్, పాన్ మొదలైన వివరాలు నమోదు చేస్తున్నారు. ఎంపీడీవో విజయలక్ష్మి, ఈవోపీఆర్డీ నాగరాజు, వెల్ఫేర్ అసిస్టెంట్ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యలు పరిష్కరించాలి

ఆర్డీవో అచ్యుతా అంబరీష్



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో అచ్యుతా అంబరీష్

కలిదిండి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆర్డీవో అచ్యుతా అంబరీష్ అన్నారు. తహ సీల్దార్ కార్యాలయంలో శుక్రవారం రెవెన్యూ అధికారులతో సమీక్షా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలను సత్వరమే పరిష్కరించాలన్నారు. విద్యార్థుల ఆదాయ కుల ధ్రువీకరణ పత్రాలు సకాలంలో అందించాలన్నారు. వెంకటాపురంలో జరుగుతున్న భూ రీ సర్వే పనులు వేగవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రామకృష్ణ, ఆర్ఐ శ్యామల, సర్వేయర్ షమీ, వీఆర్వోలు పాల్గొన్నారు. అనంతరం శివరాత్రి పురస్కరించుకుని పార్వతీ సమేత పాతాళ భోగేశ్వరస్వామి కల్యాణోత్సవాలకు జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు.

దివ్యాంగుల పింఛన్ల తనిఖీ

ముదినేపల్లి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలో దివ్యాంగుల పింఛన్‌లు తనిఖీ నిర్వహిస్తున్నారు. మండలంలో 182 వివిధ రకాల దివ్యాంగుల పింఛన్లు ఉండగా, ఇప్పటి వరకు 65 పింఛనుదారుల వెరిఫికేషన్ పూర్తయింది. ఈ నెల 20లోగా మిగిలిన వికలాంగుల పింఛన్ వెరిఫికేషన్ పూర్తి చేస్తామని అధికారులు తెలిపారు. వీరికి గతంలో మచిలీపట్నం ప్రభుత్వాసుపత్రిలో మంజూరు చేసిన అంగవైకల్యం ధ్రువీకరణ పత్రాలను ప్రస్తుతం ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో పరిశీలించి అంగ వైకల్య పరీక్షలు కూడా నిర్వహిస్తున్నారు.



ఇండస్ట్రియల్ విజట్ నుంచి క్యాంపస్‌కు తిరిగి వస్తున్న ట్రిపుల్ ఐటీ విద్యార్థులు

ట్రిపుల్ ఐటీ విద్యార్థుల ఇండస్ట్రియల్ విజిట్

నూజివీడు టౌన్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్ కెమికల్ డిపార్ట్‌మెంట్ నిర్వహించిన ఇండస్ట్రియల్ విజిట్ విజయ వంతంగా ముగిసిందని ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ అమరేంద్రకుమార్ తెలిపారు. దాదాపు 34 మంది విద్యార్థులు హెచ్‌వోడీ మధుసూదన్‌రెడ్డి అధ్యాపకులు ఎం.రామకృష్ణ ఆధ్వర్యంలో రెండురోజుల పాటు ఇండస్ట్రియల్ విజిట్‌లో భాగంగా హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ విశాఖపట్నం రిఫైనరీని సందర్శించి ముడిచమురు శుద్ధి విధినాలు, పలు యంత్రాల పనితీరును అధ్యయనం చేశారన్నారు. ఏవో లక్ష్మణరావు, డీన్ ఆఫ్ అకాడమిక్స్ డాక్టర్ చిరంజీవి పాల్గొన్నారు.

'నూజివీడుకు కేంద్రీయ విద్యాలయం గత ప్రభుత్వ విజయమే'



మాట్లాడుతున్న ప్రతాప్ అప్పారావు

నూజివీడు,ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : నూజివీడుకు కేంద్రీయ విద్యాలయం రావడం గత ప్రభుత్వ విజయమని నూజివీడు మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నాయకులు మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు గత ప్రభుత్వం నూజివీడు ట్రిపుల్ ఐటీ వద్ద ఏడు ఎకరాల భూమిని కేటాయించడంతో పాటు ఎంప్లాయిస్ కాలనీలోని ఎంపీపీ పాఠశాల భవనాన్ని అభివృద్ధి చేసిందన్నారు. ఏప్రియల్‌లో కేంద్రీయ విద్యాలయం ప్రారంభం అవుతుందని, జూన్ నెల నుంచి 5వ తరగతి వరకు తరగతులు ప్రారంభం అవుతాయన్నారు.

ప్రైవేట్ హుండీలతో దేవుని సొమ్ము ఇళ్లకు..

చారిత్రక ప్రసిద్ధిచెందిన ఆగిరిపల్లి లక్ష్మీనరసింహస్వామి ఆలయం రథోత్సవంలో భాగంగా ప్రైవేట్ హుండీలను ఏర్పాటు చేసి లక్షలాది రూపాయల నగదును కొందరు వ్యక్తులు తమ ఇళ్ళకు తరలించటం దారుణమని, వారిపై కఠినచర్యలు తీసుకోవాలని ప్రతాప్ అప్పారావు కోరారు. గత ప్రభుత్వంలో రెండు సంవత్సరాల పాటు వారి ఆగడాలకు చెక్ పెట్టడం జరిగిందన్నారు. దేవదాయశాఖ అధికారు లు తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు.

పీడీఎఫ్ అభ్యర్థిని గెలిపించాలి



ముసునూరు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): గుంటూరు. కృష్ణా జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ పీడీఎఫ్ అభ్యర్థి కే.ఎస్ లక్ష్మణరావును గెలిపించాలని మండలంలోని పలు గ్రామాల్లో సీఐటీయు నాయకులు శుక్రువారం ప్రచారం నిర్వహించారు. జిల్లా నాయకుడు జి.రాజు మాట్లాడుతూ సామాన్య ప్రజానిక సమస్యలను శాసన మండలిలో ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళి పరిష్కరించేలా కృషి చేసిన వ్యక్తి లక్ష్మణరావు అని అన్నారు. ఆయనను మరోసారి గెలిపించాలని కోరారు. మండల కార్యదర్శి కొడవలి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఇంటర్వ్యూ..

పెద్దింటి అమ్మవారి ఉత్సవాలకు పటిష్ఠ ఏర్పాట్లు



కూచిపూడి శ్రీనివాసరావు, ఈవో, పెద్దింటి అమ్మవారి ఆలయం

- **కొల్లేటి పెద్దింటి అమ్మవారి ఉత్సవాలకు ఎలాంటి ఏర్పాట్లు చేస్తున్నారు?**

జవాబు : గతంలో వలే భక్తులకు పటిష్టమైన ఏర్పాట్లు చేస్తున్నాం. ఆలయ ఆవరణలో చలువ పందిళ్లను ఏర్పాటు చేశాం. భక్తులకు క్యూలైన్లో మంచినీరు, మజ్జిగ అందిస్తాం.

- **ఎంతమంది భక్తులు వస్తారని అంచనా?**

జవాబు : సుమారు రెండు లక్షలకు పైబడి భక్తులు వస్తారనే అంచనాలతోనే ఏర్పా ట్లు చేస్తున్నాం.

- **కల్యాణం, తెప్పోత్సవానికి ఎలాంటి ఏర్పాట్లు చేస్తున్నారు?**

జవాబు : మార్చి 1 నుంచి 13 వరకు జాతర. 10న అమ్మవారి కల్యాణం, 13న తెప్పోత్సవం నిర్వహిస్తాం.

- **సాంస్కృతిక కార్యక్రమాలు.. ?**

జవాబు : ప్రతి రోజు సాయంత్రం సాంస్కృతిక, పౌరాణిక నాటక కార్యక్రమాలు ఏర్పాటు చేశాం.

- కైకలూరు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ముదినేపల్లి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి, పెదపాలపర్రు విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని గుడివాడ డివిజన్ విద్యుత్ శాఖ డీఈ జి.బి.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. పై సబ్ స్టేషన్ల పరిధిలోని గృహాలు, వాణిజ్య, ఆక్వా విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

ముగిసిన ఈ-క్రష్ 9వ వార్షికోత్సవాలు

నూజివీడు టౌన్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ఆంగ్లభాషపై పట్టు సాధించడం ద్వారా మెరుగైన ఉపాధి, ఉద్యోగ అవకాశాలను సాధించవచ్చని ట్రిపుల్ ఐటీ ఆంగ్ల విభాధిపతి మరియరాణి అన్నారు. నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో ఈ-క్రష్ 9వ వార్షికోత్సవాలు ఆంగ్ల విభాగం ఆధ్వర్యంలో నిర్వహించారు. భాషాభివృద్ధి విద్యార్థుల్లో క్రమశిక్షణ, నాయకత్వ నైపుణ్యాలను పెంపొందిస్తుందన్నారు. ఆంగ్ల అధ్యాపకులు ప్రతాప్ విద్యార్థులు పాల్గొన్నారు.

5.4 టన్నుల రేషన్ బియ్యం పట్టివేత

చాట్రాయి, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): జిల్లా పౌర సరఫరాలశాఖ అధికారి (డీఎస్‌వో) సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో శుక్రవారం తనిఖీలు నిర్వహించి మండలంలోని చిన్నంపేటలో 4.5 టన్నులు, మర్లపాలెంలో 9 క్వింటాళ్ళు మొత్తం 5.4 టన్నులు అక్రమంగా రవాణా అవుతున్న రేషన్ బియ్యం పట్టుకున్నట్లు విస్సన్నపేట సివిల్ సప్లైస్ డిప్యూటీ తహసీల్దార్ వెంకటేశ్వరరావు చెప్పారు. రేషన్ బియ్యాన్ని, మినీ లారీ, ఆటోను సీజ్ చేసి, రేషన్ బియ్యం రవాణా చేస్తున్న ముల్లంగి సాయి, గుర్రం గోపిరాజు వాహన యజమాని ఖాజాబాయ్ పైనా 6ఏ 7(1) కింద కేసు నమోదు చేసినట్లు డీటీ వెంకటేశ్వరరావు చెప్పారు.